ప్రజాశక్తి

Vol. 1, no. 28

(Dec. 23, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 28

(Dec. 23, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు : 0-1-6 | PRAJA SAKTI | Regd. No. M. 4486.

సంపాదక వర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు
(సంపాదకుడు)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

ప్రజాశక్తి

అంతర్జాతీయ పార్టీశాఖ
భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 1 | బుధవారం 23-12-42 బెజవాడ | సంచిక 28

మన రాజకీయాలు

వైస్రాయి ఎందుకు ప్లేటుమారుస్తున్నాడు ?

చిట్టగాంగ్ ఏరియా ఈ నెల 5, 14, 16, 20 తేదీలలోను, కలకత్తా 20, 22 తేదీలలోను జపాను విమానదాడులకు గురి అయాయి. 5 వ తేదీని జరిగిన దాడిని గురించి చిట్టగాంగ్ జిల్లా బార్ ఎసోసియేషన్ (వకీళ్ళ సంఘం) యీ క్రింది తీర్మానం చేసింది. "శత్రువు పట్టణంమీద బాంబులు వేయడను నమ్మకంతో ప్రజలు తమ మామూలు పనులలో నిమగ్నులై యున్నారు. పట్టణంయొక్క సరిహద్దులలో బాంబులు పడుతూన్నప్పటికీ వారు ధైర్యంతో తమ నిత్యకృత్యాలు చేసుకుంటున్నారు. కాని, యిటీవల జరిగిన విమాన దాడులవల్ల పట్టణం సహితం జపాను బాంబులకు గురి కాక తప్పదని స్పష్టమయింది." సామాన్య ప్రజలకు ప్రాణనష్టం కలుగకుండా కోర్టులు, విద్యా సంస్థలు మరొక ప్రదేశానికి మార్చవలసిందని పై సంఘం ప్రభుత్వాన్ని కోరింది. చిట్టగాంగ్ ప్రజల మాదిరిగానే మన దేశీయు లనేకమంది జపాన్ బాంబులు తమపైకి రావని భ్రమపడుతున్నారు. "మన సారధి, మన సచివుడు; మన మిత్రుడు" అని జపానును గురించి తీయని కలలుగనే దేశభక్తులకు పై తీర్మానం కళ్ళు తెరుస్తుంది. జపాను హంతకులకు భారతీయుల రక్తమెంత రుచో, తెలియజేస్తుంది.

దక్షిణ ఇండియాపై కూడానా ?

కాని, ఇండియాలో బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమ పాతకాలపు పద్ధతుల్ని వదలడం లేదు ఇతరచోట్ల జపానుకు చిక్కు లెక్కువైతే దక్షిణ యిండియాపై జపాను సేనలు పడవచ్చునని యిండియా సర్వసేనాని మద్రాసు వుపన్యాసంలో అంగీకరించుతూ, పూర్వంకంటె యిప్పుడు యుద్ధ సన్నాహాలెంతో చక్కగా వున్నాయని సంతృప్తి చెందాడు. ప్రజలసహకారం యెంత యెక్కువగా వుంటే అంత మంచిదని వేవెల్ ఒప్పుకున్నంతమాత్రాన జపాన్ సేనలు రాకుండా వుండవు. కేవలం మిలిటరీ బలంపై ఆధారపడడంవల్ల సంపూర్ణ విజయం లభించదని బర్మా - మలయాల గుణపాఠం యీతను జ్ఞాపకం చేసుకోవలసియుంది.

వైస్రాయి ప్లేటుమార్పు

ఈ నెల 17 వ తేదీని వైస్రాయి కలకత్తాలో ఉపన్యసిస్తూ, భారతదేశంలో ఐక్యతపై ధర్మోపన్యాసం గావించాడు. భూగోళరీత్యా, ఇండియా అంతా ఒకటేనట. ఈ ఐక్యతను అల్పసంఖ్యాక హక్కుల కనుగుణ్యమైన పద్ధతిని అభివృద్ధి చేయాలట. అల్ప సంఖ్యాకుల ప్రత్యేక హక్కుల్ని తామే కాపాడుకున్నామనీ, తామే వారికి ధర్మకర్తలమనీ, గొంతు కలు చించుకుంటూన్న సామ్రాజ్యవాద ఏజంట్లు, ఈ రోజున ప్లేటుమార్చి, ఇండియా అంతా భూగోళరీత్యా ఒకటేనని వాపి చడంలో ఆశ్చర్యంలేదు. జపాను ప్రమాదాన్ని అంతకంతకు గుర్తించి, విధ్వంసక చర్యల నిష్ప్రయోజనాన్ని తెలుసుకొంటూన్న జాతీయవాదులు క్రమ క్రమంగా జాతీయైక్యతయొక్క ప్రాముఖ్యతను గుర్తిస్తున్నారు. ఇందుకు మార్గం, ముస్లిం ప్రజలు అధికసంఖ్యాకులుగావున్న ప్రదేశాలలో వారికి స్వయంనిర్ణయహక్కు యివ్వడమేనని తెలుసుకొంటున్నారు. ముఖ్యమైనరాజకీయపార్టీలన్నీ ఈసూత్రాన్ని క్రమంగా అంగీకరిస్తున్నాయి. తత్ఫలితంగా, కాంగ్రెసు-ముస్లింలీగ్‌లమధ్య ఒడంబడిక కుదిరిపోతుందేమోనని వైస్రాయివంటి అధికారులు భయపడుతున్నారు. అట్టి ఒడంబడిక కుదిరితే, తామిక ప్రపంచాన్ని కల్లిబొల్లి వాదనలతో వంచించలేరు. కనుక, "ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటి కామాటలాడి" పంథాను పట్టవలసివచ్చింది. ఇండియా అంతా ఒకటేననీ, భూగోళరీత్యా దాన్ని విభజించరాదనీ, ఉపన్యసించడంలోగల అంతరార్థం ఇదే. హిందూమహాసభ నాయకులుకోరే "అఖండ హిందుస్థాన్" పాటకు వైస్రాయి శ్రుతివేస్తున్నాడు రొట్టెలపంపకంలో పిల్లుల్ని వంచించి, రొట్టెనంతనూ కాజేసిన కోతివలె వైస్రాయి ముస్లింలీగ్‌ను ఒకసారి హిందూమహాసభనొకసారి వీపు దువ్వుతున్నాడు.

కామ్రేడ్
కంభంపాటి సత్యనారాయణ

వివిధపార్టీల వైఖరి

కాని, యీ పన్నాగాన్ని వివిధ రాజకీయ పార్టీలు తెలుసుకుంటున్నాయి. లిబరల్ ఫెడరేషన్ అధ్యక్షుడు వ్యాఖ్యానిస్తూ, బానిసత్వంలో ఐక్యత మంచిదో, ప్రత్యేక రాష్ట్రాలకు స్వయంనిర్ణయ హక్కును గుర్తించడం మంచిదో, దేశీయులు నిర్ణయించుకోవాలని ప్రకటించాడు. ప్రజాభిప్రాయం క్రమక్రమంగా స్వయంనిర్ణయహక్కును గుర్తించే సమయంలో వైస్రాయి రెండవ కొసకు వేలుచూపుతున్నాడని రాజాజీ నిందించాడు. ముస్లింలీగ్ దినపత్రిక "డాన్" (అరుణోదయం) విమర్శిస్తూ, కావలసినంత కుట్ర యీ ఉపన్యాసంలోవున్నదనీ, కాంగ్రెసును అది సంతృప్తి పరచకపోగా, మహమ్మదీయులు విముఖులవుతారనీ, వ్రాసింది.

అలహాబాదు సమావేశం

అలహాబాద్‌లో 12, 13 తేదీలలో సమావేశమైన రాజకీయ నాయకులు కొన్ని తాత్కాలిక నిర్ణయాలకు వచ్చారనీ, వాటిపై జిన్నాతో రాయబారాలు జరుపుతారనీ, తెలుస్తోంది. పంజాబు మంత్రివర్గంలో ఒక "సర్" విధుదాంకితుడు రావ్పిండీలో ఉపన్యసిస్తూ, పాకిస్థాన్ సూత్రాన్ని అంగీకరించిన అలహాబాద్ సమావేశపు నిర్ణయం రాజకీయంగా మహోపద్రవాన్ని తెచ్చిపెడుతుందని ఖండించాడు. దీన్నిబట్టి, అలహాబాద్ సమావేశంలో, ముస్లింలు మెజారిటీగా వున్న ప్రాంతాలకు స్వయంనిర్ణయహక్కును గుర్తిస్తూ తీర్మానించ బడిందని తెలుసుకోవచ్చు జిన్నా యీ అవకాశాన్ని జారవిడువక, కాంగ్రెసు నాయకులతో ఇంటర్వ్యూ కోరవలసి యుంటుంది. వైస్రాయి వేసిన ఉచ్చులో పడకుండావుండాలంటే, ఇదొక్కటే మార్గం నిష్పక్ష సమావేశపు స్టాండింగ్ కమిటీ ప్రకటించినట్లు "భారతీయులలో గల భేదాభిప్రాయాలే ఇండియాలో చెలరేగిన అశాంతికి మూలకారణమని అమెరికన్ ప్రజలకు, చైనా ప్రజలకు, తెలివి తేటలతో గూడిన ప్రచారంవల్ల సామ్రాజ్యవాదులు చెప్పగలుగుతున్నారు. అంతేగాని, నిజమైన అధికారాన్ని తాము వొప్పగించ నిరాకరిస్తున్నామని చెప్పడం లేదు.

నిరంకుశ విధాన తాండవం

ఈ విధంగా, ఒక వైపు భారతీయులలో గల భేదాభిప్రాయాల్ని సామ్రాజ్య వాదులు అవకాశంగా తీసుకుంటూ, మరొక వైపున ప్రజలపై దారుణమైన నిరంకుశ కాండను తాండవిపజేస్తున్నారు బ్రిటన్‌లో ఫాసిస్టు పార్టీకి నాయకుడైన మాస్లీ అనుచరుల్ని జైళ్లలో నుంచి విడుదల చేస్తూ, యిటు ఇండియాలో ఫాసిస్టువ్యతిరేక సమర్థుల నాయకుల్ని విచారణ సహితం లేకుండా నిర్బంధిస్తున్నారు. శత్రువు యొక్క గూఢచారులకు సహితం బహిరంగ విచారణ ఉన్నప్పుడు, డిటెన్యూలను విచారణ లేకుండా జైళ్లలో ఉంచడం ఘోరమని యిటీవల నాగపూర్ హైకోర్టులోనే తీర్పు చెప్పబడింది. చీమూర్‌లో పోలీసులు - మిలిటరీ ప్రజలపైగావించిన అత్యాచారాలను గురించి విచారణ చేయించ వలసిందని ప్రొఫెసర్ భన్సాలీ ప్రభుత్వాన్ని కోరగా, అందుకు నిరాకరించడం వల్ల ప్రాయోపవేశం చేస్తున్నాడు, కొల్హాపూర్, అహమ్మదాబాద్, మొదలైన చోట్ల ప్రజలపై తుపాకులు కాల్చారు. సాముదాయిక జరిమానాలు, ఎరస్టులు, లాఠీచార్జీలు, విధివిహీనంలేకుండా అన్నీ జరుగుతున్నాయి.

బ్రిటన్ అమెరికాలలో

కాని నిర్బంధ విధానంవల్ల భారత దేశ సమస్య పరిష్కరించబడదనీ, జాతీయ ప్రభుత్వ స్థాపనకు పూనుకోవడమే తక్షణం జరుగవలసిన పని అనీ, బ్రిటన్ - అమెరికాలలో తీవ్రంగా ప్రచారం సాగుతోంది. విలియం సిమ్సు, మిష్టర్ నార్టన్ అను అమెరికన్ విలేఖరులు పైకోర్కెనుబలపరుస్తూ వ్యాసాలు వ్రాశారు. 70 గురు సుప్రసిద్ధ అమెరికను రచయితలు, ఆర్ట్ శాస్త్ర నిపుణులు, కార్మిక నాయకులు, మతాధికారులు కలిసి రూజ్వెల్టుకు ఒక సంయుక్త లేఖను పంపుతూ, అందులో సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని తీవ్రంగా ఖండించారు. లండన్‌లో సొసైటీ ఆఫ్ ఫ్రెండ్స్ (మిత్రుల సంస్థ), సోషలిస్టుపార్టీ సభ్యుడైన ప్రిట్ కూడ జాతీయ ప్రభుత్వ వాదను బలపరుస్తూ ప్రకటనలు గావించారు. భారతదేశంయొక్క విజ్ఞాన సంపదను గురించి సోవియటు యూనియన్‌లో జరిగే పరిశోధనల్ని వివరిస్తూ యిటీవల యిండియన్ సైన్సు కాంగ్రెసు కొక సందేశం పంపబడింది.

ముగింపు

ప్రపంచప్రజలుమాత్రం సామ్రాజ్యవాదాన్ని బలపరచడ లేదని వీటివల్ల రుజువౌతూంది. ఇండియాలో ప్రభుత్వ మవలంబిస్తూన్న విధ్వంసకవిధానాన్ని వారు ఖండిస్తున్నారు. అయితే, సామ్రాజ్యవాదులింకా మన దేశంలో ఎందువల్ల పెత్తనం చెలాయించగల్గుతున్నారు? సర్వతోముఖమైన జాతీయైక్యత లేకపోవడంవల్లనే. జపానుదాడిని మనంజయప్రదంగా ఎదుర్కోవాలన్నా, జాతీయ ప్రభుత్వాన్ని లాగుకోవాలన్నా, జాతీయైక్యత ఒక్కటేమార్గం. ఇందుకు ప్రజలందరూ, వివిధ తరగతులవారు, వివిధ పార్టీలవారు, సంయుక్త సమావేశాలు జరిపి ఐక్యతానినాదంతో ఆకాశాన్ని ఘూర్ణిల్లచేయాలి.

ప్రజాశక్తి

23-12-42 బుధవారం

ఇక మీదట

ఐక్యతాఉద్యమం ప్రారంభించి 1½ నెలలు అయింది. ఈ కొద్దికాలంలోనే ఆంధ్రరాష్ట్ర మంతటా దాదాపు 1000 గ్రామాలనుంచి 1 లక్షమైగా సంతకాలు వచ్చాయి. ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్బంధవిధానంపట్ల దేశీయుల అసంతృప్తిని. జాతీయనాయకులు విడుదలై, జాతీయప్రభుత్వం ఏర్పడినప్పుడే మన దేశాన్ని మనం జయప్రదంగా రక్షించుకోగలమనీ; ఇది నెరవేరాలంటే జాతీయైక్యత తప్ప వేరే మార్గం లేదనీ నమ్మిన లక్షమంది సంతకాలివి. సంతకాల ఉద్యమంద్వారా జాతీయ ప్రభుత్వం వస్తుందని ఏవరూ కలలోగూడా అనుకోలేము. అయితే ఈ సంతకాలు దేనికి? ఇది సరిగా అర్థంచేసుకుంటే, ఐక్యతాఉద్యమంలోని తరువాత ఘట్టాలు వెంటనే బోధపడతాయి.

ఆగస్టు 9 వ తేదీనుంచి ప్రభుత్వం అవలంభిస్తున్న తెలివితక్కువ నిర్బంధ విధానం వల్లనూ, పెడత్రోవను పట్ట దేశభక్తుల విధ్వంసక కార్యములవల్లనూ, దేశమంతా భగ్గుమని మండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రజలలో చీలికలు కల్పించి, ప్రజాఉద్యమాన్ని అణచివేసి నిరుత్సాహంతో గూడిన వాతావరణాన్ని తయారు చేయాలని పూనుకుంది ప్రభుత్వం. భారతీయుల నైతికపతనమునకు ఎదురుచూస్తున్న జపాన్ సంతోషించి చంకలు కొట్టే పరిస్థితులవి.

ఈ విషాదపరిస్థితిలో, దారి తెన్ను తెలియని ప్రజాసామాన్యము నందరిని విధ్వంసకచర్యల నుంచి మరల్చి, నిరుత్సాహాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసాన్ని కల్పించి ఉత్సాహాన్ని పురికొల్పుటకు, సంతకాల ఉద్యమం తోడ్పడింది. కాని ఐక్యతాఉద్యమంలో ఇది కేవలం ప్రథమదశ, మొదటిమెట్టు.

"ఐక్యతయే పోరాటం"— అనే నినాదంలోనే ఈరోజు మా పార్టీ పాలసీ యొక్క సారాంశమంతా ఇమిడి యున్నది. ఐక్యతాఉద్యమంలో ఇంతవరకూ కలిగిన అనుభవాలు, ఇది సరియైన నినాదమని ఋజువుచేస్తున్నాయి. అసంఖ్యాకులైన ప్రజలను—హిందువులను, ముస్లిములను; చిన్నజాతులవారిని, అన్నివర్గాలవారిని— సంఘటితపరచుట ద్వారానే మన మాతృభూమిని రక్షించుకోగలమని ఐక్యతాఉద్యమ అనుభవాలు స్పష్టంగా చెప్తున్నాయి.

భారతీయుల ఐక్యతను భగ్నం కావించి, ప్రజలలో చీలికలను ఎక్కువచేసి, ఇతరదేశ ప్రజల సానుభూతిలేకుండా చేయుటకు ప్రభుత్వం అనుసరిస్తున్న దాడికి, ఐక్యతాఉద్యమం ద్వారా ప్రజలయొక్క తిరుగుదాడి ప్రారంభమయింది. ఈ ప్రచండ ప్రచారంవల్ల, దారి తెన్ను గానని అనేకమంది దేశభక్తులు, వెర్రి ఆవేశంలో విధ్వంసక చర్యలే స్వాతంత్ర్య పోరాటమని నమ్మిన స్వాతంత్ర్య వీరులు, మన పంథా నంగీకరించి ఐక్యతాఉద్యమంలో పాల్గొంటూన్నారు. ఇంతేగాదు. ఇంతవరకూ రాజకీయాల గాలియే సోకని ప్రజాసామాన్యం చైతన్యం పొంది, అందర్నీ ఎదుర్కొనే ప్రధానసమస్య యైన శత్రు దురాక్రమణను గురించి ఆలోచించడం ప్రారంభించారు. ఫాసిస్టు ఏజంట్లు, ఫార్వర్డుబ్లాకు గావించే ముష్కరజపాన్ అనుకూల ప్రచారం క్రమంగా అరికట్టబడుతోంది. ప్రజలలో మనోధైర్యం తిరిగి వస్తోంది.

ముస్లింజాతుల స్వయంనిర్ణయ హక్కును ముస్లిం ప్రజలు ఎంత గాఢంగా వాంఛిస్తున్నారో తెలుసుకున్నాం. జాతీయ స్వయంనిర్ణయ సూత్రమును అంగీకరించుట ద్వారానే హిందూముస్లిం సమస్య పరిష్కారం కాగలదని, సంతకాల ఉద్యమంవల్ల స్పష్టపడింది. ఇంతేగాదు. ప్రజల దైనందిన కష్టాలమీద, ముఖ్యంగా ఆహారపదార్థాల సమస్యపై ప్రజలలో వివిధసెక్షన్లను, కుల, మత, వర్ణభేదాలు లేకుండా ఎలా సమీకరింప వచ్చునో తేటతెల్లమయింది.

ఇంతటితో మన కర్తవ్యం పూర్తికాలేదు. ప్రారంభదశ నుండి రెండవదశకు పోవలసి యున్నది. అన్ని ప్రాంతాలలోనూ వెంటనే ఐక్యతాసభలను జరపాలి. వివిధపార్టీలకు, మతాలకు, వర్గాలకు చెందినవారంతా, ఐక్యతాఉద్యమ కార్యక్రమానికి అంగీకరించే వారందరూ సమావేశమై, ఐక్యతాఉద్యమ నినాదాలను గురించి తీర్మానాలు గావించాలి.

ముఖ్యంగా, నిత్యజీవనంలో మనలను ఎదుర్కొనే క్లిష్టసమస్యలైన ఆహార పదార్థాల కరువు, చిల్లరకరువు, సాముదాయిక జరిమానాలు, మొదలైన సమస్యల మీద ఐక్యసమావేశాలను జరిపి, ఈ కష్టాలను తొలగించుటకు విరామం లేకుండా పని చేయాలి. తద్వారానే సర్వతోముఖమైన హిందూ-ముస్లిం ఐక్యత, స్వాతంత్ర్యం కోరే భారతప్రజలందరి ఐక్యత, నిర్మించబడుతుంది. ఇందుకొరకు సంతకాల ఉద్యమంలో ముందుకు వచ్చినవారందరినీ సమీకరించి కార్యాచరణకు పూనుకునేటట్లు చేయాలి. అరాజక పరిస్థితులను ఎదుర్కొనుటకు, పల్లెలలోనూ, పట్టణాలలో ప్రజా రక్షణదళాలు, ఆహారసప్లయికమిటీలను ఏర్పరచాలి. ఈవిధంగా రాజకీయ ఉద్యమంగా అభివృద్ధి చేసినప్పుడే ఐక్యతాఉద్యమం యొక్క విప్లవస్వభావం ఋజువవుతుంది.

బెంగాల్ ఉప్పెన

నవంబరు ప్రారంభంలో వచ్చిన ఉప్పెన విపరీత నష్టాలను కలిగించింది. ఇండ్లు కాగితపు మేడలవలె కూలిపోయాయి. ఇండ్లకప్పుల యినుప రేకులు కొట్టుకుపోతూ అడ్డంవచ్చిన జీవాలన్నిటిని బలిగొన్నాయి చెట్లు పెల్లగిలి చెత్తవలె కొట్టుకుపోయాయి. గాలి విసురు, వర్షం తీవ్రత, మేఘాలగర్జనలో మాటాడడం, వినడం, అసంభవమయింది. గాఢాంధకారం అలముకొని చూడడం అసాధ్య మయింది. సముద్రంకొంచెం పైకి పొంగి నేల యెచటా కనబడని జలమయం అయింది. నీటిపైన వేలకొలది రకాల పాములు, మొసళ్ళు తేలాయి. ప్రభుత్వ అంచనాప్రకారము మిడ్నపూర్ 24 పరగణాల జిల్లాలలోనే 11 వేలమంది ప్రజలు చనిపోయారు. 75 వేల పశువులు ప్రాణాలు గోల్పోయాయి.

నివారణకు ఆటంకాలు

ఈ కష్టాలు చాలవా అన్నట్లుగా ప్రభుత్వం మిడ్నపూరు జిల్లాలో గ్రామాలపై సాముదాయక జరిమానాలు కూడా విధించింది. తుపాన్ నివారణ కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజలకు తోడ్పడుచున్నవారికి అనేక ఆటంకాలు కల్పించబడుతున్నాయి. సహాయక సంఘాలను యేర్పరచి ప్రజా సేవ చేయ బూనుకున్న కమ్యూనిస్టులను అరెస్టుజేసి జైళ్ళకు పంపుతోంది. కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రకమిటీ తరపున, తుపాను బాధితులకు సహాయక సంఘాలను ఆర్గనైజు చేయడానికి వెళ్ళిన కామ్రేడ్ నృపేన్ సేను అరెస్టు చేయబడ్డాడు. జిల్లా కలెక్టరుకు తానెందుకు తుపాన్ పీడిత ప్రాంతానికి వెళుతున్నదీ తెలియజేస్తూ వ్రాసిన జాబు చూపినా పని లేదు. మిలిటరీ గార్డు క్రింద, చేతులకు సంకెళ్ళు వేసి, 12 మైళ్లు బురద నీళ్ళలో నడిపించి, తాల్మాక్ జైలుకు తీసుకు వెళ్ళారు. రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు అసమ్మతి తెలుపుతూ యెన్నోసార్లు వ్రాశాక, చివరకు 24—11—42 తేదీన వదిలారు.

బయటకు వచ్చాక కామ్రేడ్ నృపేన్ సేన్ స్టేటుమెంటు యిచ్చాడు. జిల్లాయందంతటా ప్రతిచోట, ప్రజలు అకారణంగా అరెస్టుచేయబడుతున్నారు. గ్రామ చౌకీదార్లు కూడా అరెస్టు చేస్తున్నారంటే, నిర్బంధ విధానం యేవిధంగా వుందో వేరుగా చెప్ప నక్కరలేదు. కాలేజీలో చేరడానికి మిడ్నపూర్ పోతున్న విద్యార్థి, మార్కెట్టుకు పోతున్న రైతు, భగవాన్‌పూరులో పట్టుకోబడిన పిచ్చవాడు, జైల్లో పెట్టబడ్డాడు. నిర్బంధ విధానం ప్రజలను యెంత హతాశులను చేసిందంటే, ప్రభుత్వం కొలది చోట్ల యిస్తున్న స్వల్ప సహాయాన్ని కూడ ప్రజలు నిరాకరించు తున్నారు.


ప్రభుత్వ ప్రకటన

బెంగాల్ ప్రభుత్వం డిసెంబరు 6 వ తేదీన ఒక ప్రకటన చేసింది దానిలో తాము సాముదాయక జరిమానాల వసూలు ఆపుజేశామనీ, బాధితులకు చేస్తున్న సహాయాన్ని మరొక చేత్తో లాక్కోడం తమఉద్దేశం కాదనిచెప్పింది. బాధితులకు సహాయాన్ని ఆర్గనైజుచేయడంలో ప్రభుత్వానికే అనేక ఆటంకాలు పెట్టబడుతున్నాయని వాపోయింది. ఉప్పెన రాకపూర్వమే విధ్వంసకచర్యలు జరిపేవారు రాకపోక సౌకర్యాలను, పోస్టు, టెలిగ్రాఫ్ సర్వీసును భగ్నపరచారనీ, వ్యతిరేకులగు వారిని డిటెయిన్ చేయడం, బెదిరించడంకూడా జరిగిందని ప్రభుత్వం ప్రకటన చెబుతూంది. ప్రభుత్వం చేస్తున్న బాధానివారణ ప్రయత్నాలను విమర్శించుతూ, కొందరు రాజకీయోద్దేశాలు నెరవేర్చుకోవాలని ఆశించుచున్నారనీ, శాంతిని కాపాడిన స్థానికోద్యోగులను నిందిస్తున్నారనీ, ఉద్దేశపూర్వకంగాచేసే ఇట్టి ఆరోపణలను ప్రభుత్వం సహించదనీ ప్రకటించబడింది.

కాని ప్రభుత్వ ఆరోపణలు అర్థరహితమైనవి. ప్రజాసంస్థలు సహకారం చేస్తేగాని బాధితులకు సహాయం సరిగా అందదు. ప్రజాసంస్థలచే ఆర్గనైజుచేయబడిన రిలీఫ్‌కమిటీలకు అవకాశమివ్వాలి. అలా ఇవ్వడంవల్ల రాజకీయ అశాంతి ప్రబలుతుందనడంలో అర్థంలేదు. వాటిలో చాలాసంస్థలకు రాజకీయాలతో సంబంధంలేదు. తక్కిన హిందూ-ముస్లిం ఐక్యసంఘము, హిందూమహాసభ కమిటీ, ప్రజల తుపాన్‌బాధా నివారణ సంఘం, వగైరా సంస్థలను ఆర్గనైజుచేసిన పార్టీలు అరాచకోద్యమానికి పూర్తిగా వ్యతిరేకంకూడా. సర్వస్వం గోల్పోయి, ఆకలితోనూ, రోగాలతోనూ బాధపడుతున్న ప్రజలు రక్షింపబడాలంటే ప్రభుత్వం పైసంస్థలన్నిటికి రిలీఫ్ (బాధానివారణ) కార్యాలలో పాల్గొనడానికి అవకాశమివ్వాలి. జిల్లాలో వాలంటీర్లను చేర్చడానికి, ఇతరచోట్లనుండి స్వచ్ఛంద సేవకులను పంపడానికి ఎట్టి ఆటంకాలు పెట్టకూడదు. ప్రజలకు సేవజేస్తుండగా అకారణంగా అరెస్టు చేయబడిన కమ్యూనిస్టులను వెంటనే విడుదలచేయాలి.

కామ్రేడ్ అల్లూరిని పెరోల్ మీద విడుదల చెయ్యాలి

కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణను గత 2½ సంవత్సరాల నుంచి ప్రభుత్వం జైలులో డిటెన్యూగా నిర్బంధించింది. వీరి తల్లిగారికి యీమధ్య జబ్బు చేసింది. ఆమె తనకుమారుని చూచుటకు రాత్రిం బవళ్ళు పలవరించుతూంది. జబ్బుగా వున్న తల్లిని చూచుటకు కామ్రేడ్ సత్యనారాయణను పెరోల్‌మీద విడుదల చేయవలసిందని కోరుతూ తండ్రిగారు ప్రభుత్వానికి పిటీషను పెట్టారు. వెంటనే అలా విడుదలచేసి తల్లిగారిని కలసికోడానికి అవకాశమివ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము.



కామ్రేడ్ రజనీ పామీదత్తు

విజయసాధనకు భారతదేశ విముక్తి అవసరం

అక్షరాజ్యాలు ప్రపంచంలో నలువైపుల యుద్ధజ్వాలలు వ్యాపింపజేశాయి. మిత్రరాజ్యాల భవిష్యత్తు ఎలావుంటుందో యెవరమూ చెప్పలేని స్థితిలో వున్నాం. ఇట్టి సమయంలో 40 కోట్లమంది భారతీయులు, అనగా ప్రపంచంలో అయిదోవంతు ప్రజలు, తాము కూడా మిత్రరాజ్యాలతో కలిసి యుద్ధం చేస్తామని ప్రకటించినందుకు వారు పరమ శత్రువులుగా భావించబడుతున్నారు. చాలమందికి యిదెంతో విచిత్రంగా కనబడవచ్చు. అయితే దురదృష్టవశాత్తు, భారతదేశ పరిస్థితి నేడు సరిగా యిలాగే వుంది.

భారతదేశ ప్రతిష్టంభన

కాంగ్రెసు నాయకత్వాన్నీ, కాంగ్రెసుపద్ధతుల్నీ, నిందిస్తూ ప్రపంచమంతట ఎన్ని విమర్శలు బయల్దేరి నప్పటికీ, ఒక్క విషయాన్ని మాత్రం ఎవరూ కాదనలేరు. స్వతంత్ర భారతదేశం మిత్రరాజ్యాలతో సహకారం తప్పక చేస్తుందని కాంగ్రెసు ప్రకటించింది. ఈ జాతీయవాంఛ నిరాకరించబడితే శాసనోల్లంఘనం ప్రారంభించబడుతుందనే బెదరింపు కూడా కాంగ్రెసు తీర్మానంలో ఉన్నది కాబట్టి, ఆ సాకుతో కాంగ్రెసువాదుల్నీ, ప్రజల్నీ, జైళ్లలో నిర్బంధిస్తున్నారు లాఠీలతో బాదుతున్నారు. కొరడాలతో అవమానిస్తున్నారు ఆర్డినెన్సులతో హింసిస్తున్నారు. తుపాకులతో కాల్చి చంపుతున్నారు. బ్రిటిష్ అధికారవర్గంలో సరియైన రాజనీతిజ్ఞులులేక, ఇండియాలో ఇంతటి విషమావస్థ ఏర్పడింది.

ఏ యుద్ధరంగంలోను కలుగనంతటి పరాజయం ఇండియావిషయంలో కలిగిందని మనం అంగీకరించి తీరాలి. అయితే మనం భారతదేశ ప్రతిష్టంభనయెడల ముభావంతో చూస్తూ కూర్చోవడానికి వీల్లేదు. అచ్చటి పరిస్థితు లెంత ప్రమాదకరంగా ఉన్నప్పటికీ, పరిష్కారమార్గం లేకపోలేదు. సకాలంలో పరిస్థితుల్ని చక్కజేయాలంటే, మనం చురుకుగా కార్యరంగంలో ప్రవేశించాలి.

భారతదేశంలో రెండవరంగం

ప్రపంచమంతట వ్యాపించిన ఈ యుద్ధంలో ప్రజలు విజయాన్ని సాధించాలంటే, ప్రతిదేశంలోను శత్రువును ఢీకొనాలి. భారతదేశ రంగం వేరు, యూరపు రంగం వేరు, అని భావించడం పొరబాటు. యూరపులో ఒకవైపు రెండవయుద్ధరంగంనేటివరకు ఏర్పరచకపోగా, అటు ఇండియాలో మాత్రం మన ప్రభుత్వాధికారులు రెండవరంగాన్ని తెరిచారు. ఫాసిజానికి వ్యతిరేకంగా కాదు సుమండీ! ఫాసిజానికి శత్రువులైన భారతీయులకు వ్యతిరేకంగా! ఫాసిస్టు హంతకులపై ఉపయోగించ బడని ఆయుధాలన్నీ నిరాయుధులైన జనసమూహాలపై ప్రయోగించబడుతున్నాయి! ఎందుకు? ఫాసిజంతో యుద్ధం చేసేనిమిత్తం, ఇతర మిత్రరాజ్యాలతో సమానహోదా తమకు కూడా కావాలని కోరినందుకు! ఇలా కోరడం ఒక మహాపరాధం అయింది. బ్రిటన్‌లో ఫాసిస్టు అనుకూల ప్రచారకుల యెడ ఎంతో ఉదార భావంతో ప్రవర్తిస్తూ వచ్చిన అధికారవర్గం, ఇండియాలో ఫాసిస్టు వ్యతిరేక ప్రచారకుల్ని నిర్బంధించడంలో అతి చురుకుగా పని చేస్తున్నారు. ఒకవైపు, బ్రిటన్‌లో ప్రతిరోజు ఫాసిస్టుపార్టీ సభ్యుల్ని, అనుచరుల్నీ, జైళ్ళలోనుంచి విడుదల చేస్తూ, మరొకవైపు ఇండియాలో నెహ్రూవంటి ఫాసిస్టు వ్యతిరేకోద్యమ నాయకుల్ని జైళ్ళలో నిర్బంధిస్తున్నారు. ఇది సహించరాని పరిస్థితి. ఫ్రాన్సులో దలడీర్ అనుసరించిన విధానమే యిటు బ్రిటిష్ అధికారవర్గం అనుసరించుచుంది ఇక ముందు కూడా యిట్టివిధానమే అవలంబిస్తే, ఫ్రాన్సుకు పట్టినగతి మనకుకూడా పడుతుంది.

ఎందువల్ల భారతీయులు ఫాసిస్టు విరోధులు?

భారతీయులు ఫాసిజానికి మిత్రులుకాదు. తమ దేశానికి స్వాతంత్ర్యం కావాలని వారు వాంఛిస్తున్నారు అనేక సంవత్సరాలు వారు స్వాతంత్ర్యంకొరకు పోరాడారు. ఆ పోరాటాలలో అద్వితీయమైన స్వార్థత్యాగం, అసమానమైన ధైర్యసాహసాలు, ప్రదర్శించారు. ఈ పోరాటాల ఫలితంగా వారు ప్రపంచ మంతటిలోను అత్యున్నతమైన జాతీయోద్యమాన్ని కాంగ్రెసు సంస్థద్వారా నిర్మించుకొనగలిగారు. చైనా జాతీయోద్యమం తరువాత భారత స్వాతంత్ర్యోద్యమమే ప్రపంచమంతటిలోను పెద్దదైన ప్రజాఉద్యమం. భారతీయులు స్వాతంత్ర్యంకొరకు పోరాడుచున్నారు కనుకనే వారు ఫాసిజానికి శత్రువులు బెర్లిన్‌లో నివసిస్తూన్న ఫాసిస్టు అనుకూల బోసును ఇండియాలో అనుచరులు బహుకొద్దిమంది మాత్రమే వీరుతప్ప మిగిలిన భారతదేశ ప్రజలందరు ఫాసిజాన్ని ద్వేషిస్తారు. ప్రజల సానుభూతి సోవియట్ ప్రజలవైపు, చైనా ప్రజలవైపు ఉంది కాబట్టి, వారిఆదర్శాలు, మిత్రరాజ్యాలఆదర్శాలు, ఒకటే. భారతదేశస్వాతంత్ర్యానికీ ప్రపంచప్రజలస్వాతంత్ర్యానికీ అవినాభావసంబంధంఉన్నదనివారినాయకులు గ్రహించి, ఆవిధంగా స్పష్టమైన ప్రకటనలు చేశారు. ఫాసిజంయొక్క నాశనానికీ, భారతదేశ స్వాతంత్ర్య సిద్ధికీ, ప్రత్యక్షసంబంధం ఉన్నదని వారు తమ ప్రజలకు తెలియజేశారు. జాతీయోద్యమాలలో బహు అరుదుగా ఉండే అంతర్జాతీయ దృక్పథాన్ని వారుప్రదర్శించారు. బ్రిటిష్ అధికారవర్గంలో నేడు ఉన్నతస్థానమలంకరిస్తూన్న మహామహులు, చైనా అబిసీనియా, స్పెయిన్ దేశాలకుద్రోహంచేస్తూన్న రోజులలో భారతదేశనాయకులు అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో తమ పాత్రను చక్కగానిర్వహించారు. చైనా, అబిసీనియా, స్పెయిన్ దేశాలయెడ సానుభూతిని ప్రకటించారు. ఆరోజులలో ఫాసిజానికి సహాయంచేసిన బుద్ధిమంతులు యీ రోజున, భారతదేశ నాయకులు ఫాసిజానికి మిత్రులని ఆడిపోస్తున్నారు. ఎంతటి విపరీతం! బ్రిటిష్ ప్రభుత్వంలో నేడు సభ్యులుగాఉన్న కొందరు మంత్రులకంటె భారతీయులే ఎక్కువ నిజాయితీగల ఫాసిస్టు వ్యతిరేకులు.

జాతీయ వాంఛ

కనుకనే, జాతీయప్రభుత్వం కావాలని వారు కోరుతున్నారు. మిత్రరాజ్యాల యుద్ధ కృషిని ఆటంక పరచకుండా, యీ మహాసంగ్రామంలో భారతీయులందరినీ పాల్గొనేటట్లు సమీకరించగలది జాతీయ ప్రభుత్వమే నని వారి నమ్మకం. ఈరోజున వినియోగంలో లేని భారతదేశ వస్తుసంపద, అంగబలం, యుద్ధానికి సమీకరించబడాలంటే, జాతీయ ప్రభుత్వ మవసరం. భారతీయులందరి విశ్వాసాన్ని చూరగొనే ప్రజాప్రతినిధులు ఆ ప్రభుత్వంలో ఉండాలి. కనుకనే, భారతదేశనాయకులు క్రిప్సు గావించిన తర్కవితర్కాలకు క్రోధావేశులయారు. ఎప్పుడో యుద్ధానంతరం, దయాధర్మభిక్షగా, యివ్వదలచిన రాజ్యాంగ సంస్కరణలయెడల వారు ప్రదర్శించిన తిరస్కారభావానికి కారణం యిదే. ఈ ఫాసిస్టు వ్యతిరేక సంగ్రామం ఇండియాయొక్క, ప్రపంచం యొక్క, భవిష్యత్తును నిర్ణయించగలదని వారు స్పష్టంగా గ్రహించారు. కనుకనే తామీ యుద్ధంలో పూర్తిగా, హృదయపూర్వకంగా, పాల్గొనాలని వాంఛించారు. జాతీయప్రభుత్వమొక్కటే తమ దేశీయులందరినీ యుద్ధోన్ముఖులుగా సమీకరించగలదని వారికితెలుసు. అట్టి జాతీయ ప్రభుత్వం నిరాకరించ బడితే, వారి హృదయాలు భగ్గున మండడం సహజంకాదా?

ఈరోజున కాంగ్రెసుసంస్థ కోరే కోరిక యేమిటి? ఇతర మిత్రరాజ్యాలతో ఇండియా కూడ సహకారం చేసే నిమిత్తం, భారతదేశ స్వాతంత్ర్యాన్ని బ్రిటిష్‌ప్రభుత్వం గుర్తించాలి, ప్రజానాయకులతో కూడిన జాతీయప్రభుత్వం స్థాపించబడి, ప్రజలందరూ సాయుధులై, జాతీయప్రతిఘటనకు పూనుకోవాలి అట్టి జాతీయ ప్రభుత్వం మిత్రరాజ్యాల కేంద్రమిలిటరీ నాయకత్వాన్ని పూర్తిగా అంగీకరిస్తుంది. చిత్తశుద్ధిగల ఏ ప్రజాస్వామ్యవాది యీ కోర్కెను వ్యతిరేకించగలడు? ఫాసిజం నాశనంకావాలని కోరే యేవ్యక్తి యీ కోర్కెను కాదనగలడు?

క్రిప్సు రాయబార మెందుకు భగ్నమయింది?

క్రిప్సు రాయబారం భగ్నం కావడానికి కారణమేమిటో పరిశీలిద్దాం. యుద్ధానంతరం భారతదేశానికీయదలచిన రాజ్యాంగ సంస్కరణలు సందేహాస్పదమే అయినప్పటికీ, రాయబారం విఫలమవడానికి యిది ప్రధాన కారణం కాదు. భారత దేశంలో రాజకీయ విభేదాలుండడంకూడాప్రధానకారణంకాదు, కానిఇదేకారణమని ప్రభుత్వం దరిమిలాను ప్రకటించసాగినది. అయితేఇదివిఫలమవడానికిఅసలుకారణం ఏమిటి? ఈ రోజున ఇండియాలో జాతీయ ప్రభుత్వాన్ని నిర్మించకపోవడం, ప్రజాప్రతినిధుల చేతులలో నిజమైన అధికారం పెట్టి నిరాకరించడం, అసలు కారణమని మనం తెలుసుకోవాలి.

కాంగ్రెసు సంస్థ మాత్రమే కాకుండా, ప్రధానమైన ప్రతి రాజకీయ సంస్థ క్రిప్సు సూచనలను నిరాకరించింది.

పరిస్థితి యింకా అధ్వానమైంది

వెంటనే రాజకీయ పరిస్థితి పూర్వంకంటె అధ్వాన్నమైంది ఇక చేయగలిగినదేదీ లేదని బ్రిటిషు ప్రభుత్వం ప్రకటించింది. జాతీయ కాంగ్రెసు ఆశాభంగంతో కృంగిపోయింది. యుద్ధంలో పాల్గొనాలని వారుచేసిన ప్రయత్నం విఫలమై, క్రమక్రమంగా సహాయ నిరాకరణను చేబట్టింది. దీనిని సామ్రాజ్యవాదులు అవకాశంగా తీసుకున్నారు. లోక కళ్యాణం నిమిత్తం శాంతి పద్ధతు లవలంబించాలని (Pacifism) వాదించే గాంధీజీ వ్రాతలను సామ్రాజ్యవాదు లాధారంగా తీసుకొని, జాతీయోద్యమ మంతా ఫాసిస్టులకు దాసోహంచేసేదిగా దుష్ప్రచారం ప్రారంభించారు. జపానుతో కాంగ్రెసు రాజీ చేసుకొని తీరుతుందని నిందించారు.

ఎ. ఐ. సి. సి. తీర్మానం

సహాయ నిరాకరణ తీర్మానం వర్కింగ్ కమిటీచే జులైలో ఆమోదించబడి, ఆగస్టు 7 న ఎ. ఐ. సి. సి. (అఖిలభారత కాంగ్రెసుకమిటీ) సమావేశంలో ప్యాసయింది. తీర్మానాన్ని 13 రు వ్యతిరేకించారు. వారిలో భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులు ముఖ్యులు. ఆ పార్టీపై యిటీవల నిషేధం తొలగించబడి, అది రోజురోజుకు దేశంలో సంపాదిస్తున్న బలం ప్రభుత్వంచే గుర్తించబడింది. ఎ. ఐ. సి. సి. తీర్మానం ఏమిచెపుతోంది? భారతదేశ స్వాతంత్ర్యాన్ని బ్రిటిష్ ప్రభుత్వం గుర్తించాలనీ; జాతీయ ప్రభుత్వం స్థాపించబడితే, భారత దేశం ఇతర మిత్రరాజ్యాలతో సహకారం చేస్తూ, ఫాసిజంతో సాయుధంగా పోరునల్పుతుందనీ, చెపుతోంది. కాని, బ్రిటిష్ ప్రభుత్వం న్యాయమైన యీ కోర్కెను నిరాకరిస్తే, శాసనోల్లంఘనం ప్రారంభించబడుతుందని కూడా తీర్మానం బెదరించింది. ఈ విధంగా బ్రిటిష్ ప్రభుత్వం ఒకవైపు వినాశకరమైన పంథా నవలంబిస్తూంటే, మరొక వైపు కాంగ్రెసు కూడా వినాశకరమైన పంథాను బట్టింది. ఉభయ పంథాలు జాతీయ విచ్ఛిన్నానికే దారితీస్తున్నాయి. బ్రిటిష్ ప్రజలకు, భారతీయులకు సమాన శత్రువైన ఫాసిజానికి మాత్రం యిదెంతో సహాయకారి.

భారత కమ్యూనిస్టుల పంథా

ఈ ప్రపంచప్రజల స్వాతంత్ర్య సంగ్రామం యెడల భారతదేశపు కమ్యూనిస్టులు సరియైన దృక్పథాన్ని, స్పష్టమైన భాషలో తెలియజేస్తున్నారు. అచ్చటి జాతీయవాదులు నేటి యుద్ధం విషయంలో మోయవలసిన బాధ్యతను ఓపికతో ప్రచారంచేస్తున్నారు.

ప్రస్తుత విషమావస్థలో వారు సహాయనిరాకరణకు బదులు బలీయమైన మరొక చక్కని కార్యక్రమాన్ని దేశానికిచ్చారు. ఇండియాలో సంపూర్ణమైన జాతీయైక్యతకు వారు తీవ్రకృషి చేస్తున్నారు ఫాసిజాన్ని యెదుర్కొనవలనే నినాదంపై కాంగ్రెసు, ముస్లింలీగు మొదలైన రాజకీయ సంస్థలన్నీ కలిసి పనియచేడానికి వారు ప్రయత్నిస్తున్నారు. ఈ నినాదంపైననే భారతదేశ సమస్య పరిష్కరించబడాలనీ, జాతీయ ప్రభుత్వం స్థాపించబడాలనీ, ప్రభుత్వంపై అన్నిపార్టీలు బలమైన ఒత్తిడి తీసుకొచ్చేటట్లు కమ్యూనిస్టులు కృషిచేస్తున్నారు. యుద్ధ కృషికి భారతీయులుసహకారం చేసేటట్లు వారిని సమీకరిస్తున్నారు. యుద్ధవ్యతిరేక చర్యలన్నీ భారతదేశ స్వాతంత్ర్యాన్ని యెలా దెబ్బతీస్తాయో ప్రజలమధ్య ఓపికతో బోధించి ఆ మార్గాలనుండి నివారింపజేస్తున్నారు. కాని, బ్రిటిషుఅధికారవర్గం నేడవలంబిస్తూన్న విధానంవల్ల, జాతీయవాంఛను నిరాకరిస్తూండడంవల్ల, కమ్యూనిస్టులు జాతీయవాదులలో అధిక సంఖ్యాకుల్ని ఒప్పించలేకున్నారు.

తరువాయి 9 వ పేజీలో

★

రజనీ పామీదత్తు బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ నాయకులలో ఒకడు. అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థయొక్క కార్యనిర్వాహకవర్గంలో సభ్యుడు. ఇతడువ్రాసిన "ఫాసిజం, సామాజిక విప్లవం" అనేగ్రంథం ఆధునిక మార్క్సిస్టురచనలలో ఉత్తమ స్థానాన్ని అలంకరిస్తుంది. "నేటిభారతదేశం" అనే గ్రంథంలో ఇతడు మన కార్మికోద్యమచరిత్రను, రైతు ఉద్యమ పరిణామాన్ని, జాతీయోద్యమాభివృద్ధిని, విపులంగా చర్చించాడు.

ఆంధ్ర విద్యార్థుల కొక విజయం

అనంతపూరు కాలేజీలో కెమిస్ట్రీ లేబరేటరీని తగులబెట్టారను అనుమానంపై సెప్టెంబరు 10 వ తేదీని కామ్రేడ్స్ ఎన్. రాజశేఖరరెడ్డి మొదలైన 8 గురు విద్యార్థులు అరెస్టు చేయబడ్డారు. కలరా నిర్మూలన, అధిక లాభాలసమస్య, అరాజకచర్యల నివారణ మొదలైన సమస్యల పరిష్కరిస్తూ, విద్యార్థి ఉద్యమంయొక్క ఐక్యతను కాపాడుతూ వీరు ఎడతెగకుండా గావించిన కృషిని ఆంధ్రరాష్ట్రీ విద్యార్థిలోకం మరచిపోలేదు. వీరి విడుదలకై అన్ని జిల్లాలలోను విద్యార్థిసంఘాలు తీర్మానాలు గావిస్తూ, ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఖండించాయి. దీని ఫలితంగా, నిరంకుశాధికార వర్గం లొంగవలసివచ్చింది. అనేక ప్రాంతాలలో విద్యార్థులు నిర్మాణయుక్తంగా గావించిన ఆందోళనను స్పెషల్ మేజస్ట్రేటు గుర్తించాడు. ఈనెల 17 వ తేదీని విద్యార్థులందరినీ విడుదలచేస్తూ తీర్పు చెప్పాడు. ఆంధ్రవిద్యార్థుల ఐక్యతావిజయానికి అభినందిస్తున్నాం.

మరొక విజయం

కొల్లూరు (గుంటూరు జిల్లా) హైస్కూలులో విద్యార్థులు "వార్ ఫ్రంటు"లో చేరవలసిందని విద్యాధికారులు నిర్బంధించారు. కాని, విద్యార్థులందరు తిరస్కరించి, తమ ఐక్యతా బలాన్ని ప్రదర్శించారు. గుంటూరు ట్రైనింగ్ హైస్కూలులో ఒక విద్యార్థి నిరాకరించినందుకు సముజాయిషీ అడుగుతూ డి. యి. ఓ. (జిల్లా విద్యాధికారి) నోటీసు పంపితే, ఆ విద్యార్థి దానికి జవాబుగా, తాను వార్ఫ్రంటులో చేరవలసిన నిర్బంధమేమీ లేదనీ, నిర్బంధిస్తే కోర్టులో ఫిర్యాదుచేస్తాననీ, వ్రాశాడు. విద్యాధికారులు ఇకనైనా యిట్టి పిచ్చిచేష్టలు మానుకుంటారని ఆశిస్తున్నాం.

విద్యార్థులకు కిరసనాయిల్ సప్లయి

కైకలూరు, గుడివాడలలో (కృష్ణా) విద్యార్థి సంఘం గావించిన ఆందోళన ఫలితంగా ప్రభుత్వాధికారులు కంట్రోలు ధరకు కిరసనాయిలు సప్లయిచేయడానికంగీకరించారు. కైకలూరులో స్కూల్ ఫైనల్ విద్యార్థులకు మాత్రం నెలకు 2 డబ్బాలచొప్పున శాంక్షన్ అయింది. గుడివాడలో విద్యార్థులందరికీ నెలకు 5 డబ్బాలు శాంక్షన్ అయింది. విద్యార్థి సంఘం తరఫున విద్యార్థులే దీనిని పంచుతున్నారు.

ప్రతికూలుర పరాజయం

విజయనగరం పట్టణ విద్యార్థిసంఘ యాజమాన్యాన 16 వ తేదీని తృతీయపట్టణ విజ్ఞాన మహాసభ జయప్రదంగా జరిగింది. కామ్రేడ్ ఈశ్వరరావు విద్యార్థి పతాకోత్సవం జరిపారు. సమావేశానికి కామ్రేడ్ విజయకుమార్ అధ్యక్షుడు. కామ్రేడ్ రామలింగయ్య ప్రారంభోపన్యాసకుడు. కామ్రేడ్ కె. గోవిందరావు ఐక్యతా తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. దాన్ని వ్యతిరేకించడానికి 4 గురు జాతీయ విద్యార్థి సంఘ ప్రముఖులు నిశ్చయించుకున్నారు. వారిలో ఎక్కువ వక్తృత్వమున్న ఒకరు గడ్డె యెక్కారు. 5 నిమిషాలిస్తే సరిపోతుందని అధ్యక్షుని కోరారు. 5 కాదు, 15 నిమిషాలిచ్చానన్నాడు, కామ్రేడ్ విజయకుమార్. అంతకు 4 రోజులు వరుసగా కమ్యూనిస్టులు దేశద్రోహులని గోడలమీదచిత్రాలు చిత్రించిన జాతీయ విద్యార్థి సంఘ ప్రముఖునికి కాళ్ళు వణకడం ప్రారంభించి, మాటలు తడబడ్డాయి. అరాజకచర్యలు తమసంస్థ కాదనీ, కమ్యూనిస్టులే సరియైన దేశభక్తులనీ, ప్రశంసించాడు. ఐక్యతా తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది. వ్యతిరేకులున్నారా? అని అధ్యక్షుడడిగినప్పుడు జాతీయ విద్యార్థిముఠా సిగ్గుతో తలలు వంచుకున్నారు! సాయంత్రం వైజ్ఞానిక మహాసభ జరిగింది 1200 మంది విద్యార్థులు హాజరయారు.

"సమాజం-సాహిత్యం," "రచయితలు-ప్రజలు," మొదలైన విషయాలపై ఉపన్యాసాలీయబడ్డాయి. తరువాత "దేశభక్తులు" అనే నాటకం వేయబడింది చిట్టివలస కార్మికులు బుర్రకథ చెప్పారు. రాత్రి 10 గంటలకు కార్యక్రమంముగిసింది. అప్పటివరకు వచ్చిన విద్యార్థులెవరు కదలకుండా కూర్చునేవున్నారు.

పరకాయప్రవేశం

అవనిగడ్డ (కృష్ణా) బోర్డుహైస్కూలులో ఒక డ్రిల్లు మాస్టరు ఉన్నాడు. కమ్యూనిస్టుల పాలసీ మంచిది కాదనీ, కమ్యూనిస్టులు దేశద్రోహులనీ, యితడు విద్యార్థులలో ప్రచారం చేస్తున్నాడు. కమ్యూనిస్టుల ప్రాణాలు తన చేతులలో ఉన్నాయట. విద్యార్థుల్ని రెచ్చగొట్టడానికి స్కూలుమాని బయటికి రమ్మన్నాడు. విద్యార్థులు నిరాకరించారు. ఈ కక్షతో డ్రిల్లుమాస్టరు విద్యార్థుల్ని హింసించ సాగాడు. ఇటీవల యితడు కొందరు 5 వ ఫారం విద్యార్థులచే సాయంత్రంపూట 150 గుంజీలు తీయించాడు. ఎన్. ఎల్. వి. శర్మ అనే పేరుగల విద్యార్థి యీ గుంజీలు తీయలేక, బలహీనతతో మూర్ఛపోయాడు. అతనికి సహాయం చేయబోయిన మరొక విద్యార్థిని యీ పుణ్యాత్ముడు నివారిస్తూ, ప్రాణం యింకా పోలేదులే! పోయాక వెళ్లవచ్చుగాని అని సలహాయిచ్చాడు. ఈ మహానుభావుడు ఉపాధ్యాయ పదవిలో ఉండడానికి అనర్హుడు. ఏ పెద్దపులో యితనిలో పరకాయప్రవేశం చేసి వెంటనే అవనిగడ్డ నివాసులు యీ పుణ్యమూర్తిని డిస్మిస్ చేయించి, తమపిల్లల ప్రాణాలను కాపాడుకోవలసిందని విన్నవిస్తున్నాం.

డిటెన్షన్ పద్ధతి పోవాలి.

డిటెన్షన్లద్వారా విద్యార్థుల్ని వదలకపోని వారిని హింసించడం ప్రస్తుతపానిన విద్యావిధానంలో ఒక ప్రధానలక్షణం. దీన్ని నిరసిస్తూ, రామచంద్రపురం (తూ. గోదావరి) విద్యార్థి సంఘయాజమాన్యాన 11 వ తేదీని ఊరేగింపు, బహిరంగసభలు, జరిగాయి.

రాష్ట్రవిద్యార్థినాయకునికి 1 సం. శిక్ష

ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘ మాజీ కార్యదర్శి కామ్రేడ్ ఎం రాధాకృష్ణకు, వారితో అరెస్టుచేయబడ్డ మరియిద్దరు కామ్రేడ్సుకు ఒక్కొక్క సం చొప్పున కఠినశిక్ష విధించబడింది.

ప్రజా యుద్ధంలో ★ నీగ్రోలు తమ హక్కులెలా సాధిస్తున్నారు?

యునైటెడ్ స్టేట్సు (అమెరికా) లో నూటికి 15 మంది నీగ్రోజాతికిచెందినవారే. అయినా దక్షిణ రాష్ట్రాలలో అమెరికన్లు ఈ నీగ్రోలను చాల అమానుషంగా చూస్తారు. వారికి ఓటింగుహక్కులేదు. విద్యా సౌకర్యాలు శూన్యం. సాంఘిక, ఆర్థిక జీవితంలో వారికిస్థానంలేదు. దారుణశిక్షలకు గురిచేయబడుతూంటారు. వారు 1866 లో బానిసత్వమునుండి విముక్తి చెందిన నాటినుండి పౌరసత్వ హక్కుల కోసం పోరాటం సల్పుతూనే వున్నారు. అమెరికను ప్రజలతో సమాన హోదాకోసం ఆందోళన చేస్తూనే వున్నారు. రానురాను, వారిఆందోళన, పోరాటం, ఫలితంగా అమెరికను కార్మికుల సహకారాన్ని, సానుభూతిని, సంపాదించారు.

యుద్ధప్రకటన: నీగ్రోలవాంఛ

జపాను అమెరికాపై యుద్ధం ప్రకటించడంతో, నీగ్రోలు మరొకొత్తసంగతి తెల్సుకున్నారు. మానవసమాజంలో సమాన హక్కుల కోసం తాము జరిపే పోరాటంయొక్క భవిష్యత్తు, మానవనాగరికతనే నాశనం గావింప పూనుకున్న ఫాసిస్టులను పరిమార్చడంలోనే వుందని వారు గ్రహించారు.

వారిని ముఖ్యంగా మూడు సమస్యలు ఎదుర్కొంటున్నాయి మొదటిది, అమెరికన్ పరిశ్రమలలో నీగ్రోలస్థితి. అనేక అమెరికన్ పరిశ్రమలలో నీగ్రోలను నిపుణులుగా నియమించరు. కొన్ని కార్మికసంఘాలలో సహితం నీగ్రోలు సభ్యులుగా చేరడానికి వీలులేదు.

రెండవది, అమెరికా దేశరక్షణలో పాల్గొనడానికి నీగ్రోలకు సంపూర్ణమైన అవకాశం ఇవ్వరు. అబ్రహాం లింకను అధ్యక్షుడైనప్పటి నుండీ నీగ్రోలను సైన్యంలో తీసుకుంటున్నారు: కాని నావికాదళంలో వారికిస్థానంలేదు. మూడవది. అన్నిటికన్న ప్రధానమైనది వారికి పౌరసత్వహక్కులు శూన్యం. ప్రతివానిమీద తలపన్ను విధిస్తారు. దక్షిణరాష్ట్రాలలో వారికి ఓటింగుహక్కు అయినాలేదు.

జాతిభేదం నెమ్మదిగా పోతూంది:

యుద్ధంవల్ల పరిశ్రమలలో కార్మికు లెక్కువగా కావలసివచ్చినా, కొన్ని పరిశ్రమల యజమానులు నీగ్రోలను పనిలో పెట్టుకోడంలేదు. అట్టి పరిశ్రమలలో ముఖ్యంగా పేర్కొనదగినది చికాగో లోని జనరల్ మోటారు ఫ్యాక్టరీ. చికాగో నీగ్రోల ఆందోళన ఫలితంగా, ప్రెసిడెంటు రూజ్‌వెల్టు అట్టిజాతిభేదాన్ని తొలగించే ఏర్పాట్లు చేయవలసిందని ఒక కమిటీని నియమించాడు. దానిలో చికాగో నీగ్రో ఆల్డర్‌మన్ గానున్న ఎర్ల్ డికెర్సన్ కూడ ఒక సభ్యుడు.

ఈ కమిటీ మెల్లమెల్లగా యజమానుల వ్యతిరేకతను పోగొట్టి, దక్షిణరాష్ట్రాలలోకూడ కొన్ని విజయాలు పొందుతూవుంది. నీగ్రో చర్చి కౌన్సిల్‌వారు రూజ్‌వెల్టుకు వ్రాసిన జాబుకు సమాధానమిస్తూ, అతడిలా వ్రాశాడు: "ఫ్యాక్టరీలలో నీగ్రోలను చేర్చుకోడంలో ఇంకా చురుకుగా పనిసాగేలాగు చూస్తాను మన సాయుధసైనిక దళాలలోకూడా ఇంకా ఎక్కువగా నీగ్రోలను తీసుకునేలాగ చూస్తాను." కొద్ది మాసాలనుండి నీగ్రోలను అర్మీ ఆఫీసర్లుగాకూడా తీసుకుంటున్నారు.

యుద్ధంలో నీగ్రోల ధైర్య సాహసాలు:

జపానుకు వ్యతిరేకంగా ఈ యుద్ధంలో నీగ్రోలు చూపుతున్న ధైర్య సాహసాలు, కర్నల్‌నాక్సులాంటి వారినికూడా లొంగదీస్తున్నాయి. జపాను సేనలు, నావికాదళం, పెరల్ హార్బరును ముట్టడించినపుడు డోరీ మిల్లర్ అనే యువక నీగ్రో నావికుడు ప్రదర్శించిన ధైర్య సాహసాలను అధ్యక్ష రూజ్‌వెల్టు మెచ్చుకుని, ఆయువకుని బహూకరించాడు. అదిమొదలు నావికా దళంలోకూడా నీగ్రోలను విరివిగా తీసుకుంటున్నారు.

కామ్రేడ్ కొండేపూడి లక్ష్మీనారాయణ

పోతే అన్నిటికన్న ఎక్కువ ప్రధానమైన తలపన్ను సమస్యవుంది. దక్షిణరాష్ట్రాలలో నీగ్రోలపై విధింపబడే ఈ తలపన్ను నిర్మూలింపబడాలనే ఆందోళన ఇప్పుడు చాల ఎక్కువయింది. తత్ఫలితంగా రూజ్‌వెల్టు, దానిని తొలగించడానికి తప్పక కృషిచేస్తానని వాగ్దానం చేయవలసివచ్చింది.

నీగ్రోల ఐక్యత:

అమెరికన్ ప్రజల దృక్పథంలో వచ్చిన మార్పుకు కారణం, నీగ్రోలఐక్యత, వారనుసరించే సరియైన అంతర్జాతీయ పాలసీ. వాటికి సహాయంగా అమెరికన్ కమ్యూనిస్టుపార్టీ, కార్మిక సంఘాలు, నిరంతర కృషి చేస్తున్నాయి ఈ కృషిఫలితంగా, సాంఘిక జీవనంలో కూడ జాతిభేదాన్ని నెమ్మదిగా తొలగించగల్గుతున్నారు అమెరికన్ ఆటలలోను, క్లబ్బులలోను, నీగ్రోలు పాల్గొనకూడదనే నిషేధాన్ని తొలగిస్తూ లాం డీన్ అనే విచారణాధికారి తీర్పుచెప్పాడు.

ఫాసిస్టు అనుకూలుర పంథా

కాని ఒకవిషయం మనం మరువకూడదు. ఇవన్నీ ప్రాథమిక విజయాలు మాత్రమే. జాతి వివక్షత పూర్తిగా నిర్మూలంకాలేదు. నీగ్రోల ఫ్యాసిస్టు వ్యతిరేక పాలసీని, చూచి వారినింకా అథఃపాతాళానికి తొక్కాలనే ఫాసిస్టు అనుకూలురు అమెరికాలో లేకపోలేదు. డెట్రాయిట్‌లో, "సోజర్నర్ట్రూత్" అను భవనం నీగ్రోలకు తెరువబడినప్పుడు పెద్ద దొమ్మీ జరిగింది. ఆ దొమ్మీలో పాల్గొన్న తెల్లవారంతా ఫాసిస్టు ఏజెంటుచే వివిధప్రాంతాలనుండి తీసుకొని రాబడినవారే.

సైన్యంలోకూడా నీగ్రోలను చేర్చుకుంటున్నారన్న మాటే గాని, వారియూనిట్లనువేరుగానే వుంచుతున్నారు. వారిని తెల్ల సైనికుల యూనిట్లలో కలవనివ్వరు.

అయితే అమెరికన్ నీగ్రోలు తమ ఒక్కరి సంగతే చూచుకోడంలేదు. పశ్చిమ ఇండియా దీవులలోను, ఆఫ్రికాలోను, వున్న నీగ్రోల హక్కులకోసంకూడ ఆందోళన చేస్తున్నారు. వారి ఉద్యమానికి సహాయంచేస్తున్నారు.

అంతేకాదు. యూరపులో రెండవరంగం యొక్క అవసరాన్నికూడ వారు గుర్తించారు. అందుకు అమెరికన్ ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నారు రెండవరంగంప్రారంభించాలేగాని, ప్రారంభిస్తే నీగ్రోలంతా తమ యావచ్ఛక్తి వినియోగించి సహాయంచేస్తామంటూ ప్రకటించుకున్నారు. అనేక తీర్మానాలలో ఈ విషయాన్ని వారు పదేపదే అమెరికన్ ప్రభుత్వానికి తెలియచేస్తున్నారు.

వరికోతలా! జపాను కుత్తుకల కోతలా!

ఆంధ్ర దేశంలో వ్యవసాయకూలీ ఉద్యమం, ప్రారంభించ బడటంలో ఆఖరునే గాని, నడవటంలో మాత్రం ముందే. ఈనాడు ఐక్యతా వుద్యమంలో వారు అత్యుత్సాహంతో, ఇతరులకు కూడా ఆదర్శప్రాయంగా వ్యవహరిస్తున్నారు. భూస్వాములతో పోరాడటంలో ఐక్యత యొక్క అవసరాన్ని గుర్తించినవారు, జపాను ఫాసిస్టులతోటి పోరాటంలో జాతీయైక్యత ఎంత అవసరమో గుర్తించుట కష్టంకాదు. భూస్వాములతోటి పోరాటాలలో నాయకత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీ, ఫాసిస్టులతోటి పోరాటంలో నాయకత్వం వహిస్తుంటే తాముఊరుకుంటారా!

దివితాలూకా (కృష్ణా) వ్యవసాయకూలీ ఉద్యమానికి పట్టుగొమ్మ. పార్టీఫండు వసూళ్ళను గూర్చి విన్నవారు ఫండు వసూలుకుగాను బయలుదేరారు. అయితే ఏ దొరకో రెక్కలమ్ముకుంటేనే గాని ఏరోజుకారోజు గడవని కుచేలులవద్ద డబ్బు నిలవ ఎక్కడిది? కామ్రేడ్ సనకా బుచ్చికోటయ్యగారు ఈ క్రింది లేఖలో దీనికి సమాధాన మిస్తున్నారు.

"దివితాలూకాలో, కొత్తపాలెం కామ్రేడ్సు రైతుకూలీల సాయంతో కమ్యూనిస్టుపార్టీ నిధికై 11-12-42 తేదీన 11 యకరముల వరికోతకోశారు. యీ 11 ఎకరముల ఖామందులైన బాసు వెంకట్రామయ్య, రేపల్లె అప్పయ్యగార్లు, మక్తారేటు య 1 కి రు 3/- లు ఉంటే, పార్టీసానుభూతి గలవారగుటచే య 1కి రు 4/- లు చొ॥ యిచ్చారు. గ్రామంలోని యువకులందరూ ఉత్సాహంగా "కత్తీ, సుత్తీ" జండాలతో, విప్లవగీతాలతో, 10 వ తేదీ రాత్రంతా గ్రామస్థులకు తెలియబర్చారు. ప్రజలు గుమిగూడిన వీధులలో, కూలీలర క్తముప్పొంగేలాగు ఉపన్యసిస్తూ, తెల్లవారురూముననే, చలిలోనే 150 మంది స్త్రీ పురుషులను కోతకు రప్పించారు. కూలీలు కూలి పాటలు మిన్నుముట్టేటట్లు పాడుతూ కోతగోసారు. కోతిగోయుకాలంలో ఫొటో తీయబడ్డది. అనంతరం చేనువద్దనే జరిగిన సభలో ప్రతి కూలి సోదరుడు, ఫేసిస్టుభూతాన్ని భారతదేశ సరిహద్దులలోనే ఊచకోత కోస్తానంటూ శపథం బట్టాడు. ప్రస్తుత ప్రమాద పరిస్థితులనుగూర్చి, ఈ పరిస్థితులలో కూలీలు, రైతులూ, ఏవిధంగా ఏకమై దేశ రక్షణకు సంసిద్ధంకావాలో కామ్రేడ్సు ఉపన్యసించారు. గట్టుమీద సగర్వంగా ఎగురుతూవున్న ఎఱ్ఱజండాకు సాల్యూట్‌లతో సభ ముగిసింది."

నేత పనివారు

భట్టిప్రోలు, అద్దేపల్లి, కోనేటిపురం గ్రామాలలోని ఖద్దరునేత పనివారు, తమకు ఈ కరువు సమయంలో మజూరీ గజం 1కి 0-4-0 నుండి 0-5-0 కు హెచ్చించమని ఆందోళన సాగించారు. దేశంలోని కష్టజీవులందరూ, పొట్టకు వెలితిలేకుండా ఉంటేనే మనస్ఫూర్తిగాదేశరక్షణ కార్యాలలో పాల్గొనగలరు. కాబట్టికామ్రేడ్సు వారిహక్కుల కొరకై పాటుబడ సాగారు. నేతపనివారల సభలో కామ్రేడ్ కస్తూరి కుటుంబరావు జీవితావసరవస్తువుల హెచ్చుధరలు, కొరత మొదలైన విషయాలను గూర్చి మాట్లాడి, ఈ సమస్యలతో బాటు ప్రజలందరినీ ఎదుర్కొంటున్న జాతీయ రక్షణ స్వాతంత్ర్య సంపాదనను గురించి తెలియ చేసారు. ప్రజలందరూ ఏకమైతేనే, దైనందిన కష్టాల నివారణతోబాటు దేశరక్షణను గూడా జయప్రదంగా సాగించగలమని హెచ్చరించాడు. సభలో ఒక కమిటీ ఏర్పడి షాహుకార్ల వద్దకు దాయబారం వెళ్ళారు. వారి ఐక్యత పట్టుకల్ల ఫలించింది. మరునాటినుంచీ వారికూలిరేటు హెచ్చింపబడింది. ఐక్యత యొక్కబలాన్ని గుర్తించిన నేత పనివారందరూ పార్టీ మహజర్లపై సంతకాలుజేసి, యథాశక్తిగా పార్టీ ఫండుకు సాయం జేసారు. ఇద్దరు ప్రజాశక్తి పత్రికలు కూడా తెప్పించు కుంటున్నారు.

ఏ స్త్రీ ఊరుకో గలదు?

'ముదితల్ నేర్వగరాని విద్యకలదే ముద్దార నేర్పించినన్' అని చిలకమర్తివారు అన్నారు. దాన్నిరుజువు చేస్తానికిగాను ప్రసన్నయాదవంలో సత్యభామచేత ధనుర్బాణాలు పట్టించారు; నరకాసురుణ్ణి మూర్ఛిల్లి పురాణ కాలంనాటిమాట ఎట్లావున్నా, నేడు ఆంధ్రస్త్రీలు జపాను అసురుల ప్రమాదాన్ని ఎదుర్కొంటానికి గాను నడుములు బిగిస్తున్నారు. కమ్యూనిస్టుపార్టీ ఇందుకు నాయకత్వం వహించింది. జాతీయైక్యతా వుద్యమంలో అనేకప్రదేశాలలో స్త్రీలు అత్యుత్సాహంతో ప్రచారం గావిస్తున్నారు.

తెనాలిలో స్త్రీల రక్షణాశిబిరం పూర్తిఐనాక విద్యార్థినులందరూ కార్యరంగంలోకి దూకారు రేపల్లెలోనూ చుట్టుపక్కల గ్రామాలలోను ప్రచారం చేస్తానికై రెండు దళాలుగా స్త్రీలు బయలుదేరారు. ఒకదళం ఒక పెద్ద ఉద్యోగస్థుని భార్యను కలుసుకొన్నారు. ఆమెకు రాజకీయవిషయాలను గూర్చి, స్త్రీలు ఆత్మరక్షణోపాయాలు నేర్చుకోవలసిన అవసరాన్ని గూర్చి తెలియజేశారు. ఆఫీసరు భార్య వింటూనే వున్నారు గాని ప్రక్కనేవున్న గ్రామమున్సబుకు ఎక్కడలేని కోపమూ వచ్చింది. జపానువస్తే ఈ పార్టీ పోతుంది; అందరూ

కామ్రేడ్ సండూరి ప్రసాదరావు

పోతారు అంటూ మొదలెట్టాడు. కాని ప్రభుత్వదాస్యంలో మునిగిన వీరికి అవసరం లేదుగాని, జపాను ఫాసిస్టు కిరాతకుల దారుణచర్యలువిన్న ఏ స్త్రీ వూరుకోగలదు? ఆఫీసరు భార్య తాను మహిళాసంఘంలో జేరి, మరొకరిని జేర్పించి, పార్టీ ఫండుకు విరాళం వాగ్దానం చేసింది.

యుద్ధం: అప్పుడు - ఇప్పుడు

కామ్రేడ్ మీరా సికిందాబాద్‌లో ఇదివరకు ఉండేవాడు. అప్పుడు అతని కమ్యూనిస్టు భావాలను ఆదరించేవారే లేరు. అతనికి కనిపించిందల్లా పరస్పర ద్వేషభావాలు, కొట్లాటలు. తిరిగి మొన్ననొకసారి సికిందాబాద్ వెళ్ళివచ్చాడు ఎంతమార్పు! ఫాసిస్టు వ్యతిరేక ప్రచార సంఘం ఈనాడు ఆఫీసును కూడా స్థాపించుకొని పనిజేస్తోంది. కామ్రేడ్ చకితుడైపోయాడు. లోపలకు వెళ్ళేసరికి చాలామంది యువకులు, విద్యార్థులు, కార్మికులు, కనిపించారు. వారి అనుభవాలు వింటూంటే కామ్రేడ్‌కు ఇది సికింద్రాబాదేనా అనిపించింది.

ఒక గుమాస్తా ఒక రోజున బస్సులో ప్రయాణం జేస్తున్నాడు. అందులో ఇద్దరు సోల్జర్లు ఉన్నారు. వారు కండక్టరును పిలిచి పరామర్శచేసి, నీవు కార్మికుడవన్న సంగతి గుర్తుంచుకో. అని 'ప్రపంచకార్మికులారా! ఏకముగండు. మనకు పోయేదేమీలేదు. సంకెళ్ళు తప్ప' అన్నారు. ఆకండక్టరుచేత కూడా అనిపించారు. పూర్వం సామ్రాజ్యయుద్ధాలలో పాల్గొనే సైన్యానికీ, నేడు ప్రజాయుద్ధంలో పాల్గొనే సైన్యానికీ ఇదీ తేడా.

సిద్ధాంతం (ప. గో.) గ్రామంలో కూడా ఒక సోల్జరును కామ్రేడ్సు కలుసుకోగా. తాను ఫాసిజాన్ని ఎదిరించుటకూ ప్రపంచ ప్రజాస్వాతంత్ర్యాన్ని సంరక్షించుటకూ పోరాడుటకు వచ్చానని తెల్పాడు. తనతోడి సైనికులు కూడా ఇవే భావాలను కల్గియున్నారని కూడా అతడు తెల్పి దేశీయులందరూ ఫాసిజాన్ని ఎదుర్కొంటానికై సిద్ధం కావాలని హెచ్చరించాడు.

అసాధ్యమా?

తాడికొండ (గుంటూరుజిల్లా) పెద్ద గ్రామం. ముస్లిములుకూడా ఎక్కువగా వున్నారు. హిందూ ముస్లిములకు, భూస్వామి వ్యవసాయకూలీలకు తగాదాలుకూడా ఎక్కువగానే వుండేవి. అట్టి గ్రామంలో కామ్రేడ్సు ఐక్యతా వుద్యమాన్ని ప్రారంభించారు.

ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికేం ఎగురుతుంది? గ్రామంలో ఉన్న కక్షలను తీర్చకపోతే జాతీయైక్యతనెట్లా సాధించగల్గుతాయి? ఆ గ్రామంలో మసీదుగోడల దగ్గర చాలాకాలం నుండీ పేచీఉన్నది. కామ్రేడ్సు ముస్లిములవద్దకు వెళ్ళినప్పుడు వారు ఆ తగాదామాట ఎత్తి, హిందువులతో ఐక్యత ఎట్లా సాధ్యం అని అడిగారు. కామ్రేడ్సు హిందూ ముస్లిములను సమావేశపర్చి నేడు దేశాన్ని ఎదుర్కొనే భయంకర ప్రమాదాన్ని గూర్చి హెచ్చరిస్తూ, ఏ జాతియైనా జీవించాలంటే ఆ ప్రమాదాన్ని ఎదుర్కొంటానికై ఏకమై తయారుకావాలనియు, చిల్లరమల్లర తగాదాలను పరస్పరం పరిష్కరించుకుంటేనే ఐక్యత చేకూరగలదనియు హెచ్చరించారు. హిందూ ముస్లింసోదరులకి సలహా నచ్చింది గోడతగాదా పరిష్కారమైంది.

హిందుముస్లిం ఐక్యత కుదిరింది: ఇక గ్రామ ఐక్యత కుదరాలి. తాడికొండలో షుమారు 200 ఎకరాల బంజరు ఉన్నది. కూలీలు తాము సాగుజేస్తామని ప్రభుత్వానికి పిటీషను పెట్టుకున్నారు కాని ఆ భూమిని కాజేయాలనే 'నక్కలు' కలెక్టరాఫీసులోనూ, తాలూకా అఫీసులోనూ కూర్చున్నాయి. వారు బినామీగా కొంతమందిరైతులచేతకూడా దరఖాస్తులు పెట్టించారు. గుమాస్తాలమూలకంగా రైతులు, కూలీలకు తగాదా వచ్చేటట్లువుంది. ఇంతలో కామ్రేడ్సు ఈ విషయాన్ని తెలుసుకొని, షుమారు 75 మంది రైతులను కలుసుకొని కూలీలకు ఆభూమిని వదలునట్లుగా నచ్చచెప్పారు. రైతులంతా ఆభూమి తమకక్కరలేదనీ, కూలీలకే ఇప్పించమనీ, ప్రభుత్వానికి తిరిగి విజ్ఞప్తులు పంపారు. రైతులు కూలీల మధ్య సామరస్యం ఏర్పడ్డది. ఈ విధంగా గ్రామంలో దైనందిన వ్యవహారాలలో ఐక్యత ఏర్పడటంవల్లనే హిందూ ముస్లింలు, రైతులు కూలీలు అంతా కలిసి 1000 పైగా ఐక్యతావుద్యమపు మహజర్లపై సంతకాలు పెట్టారు.

సిగ్గుచేటు

కమ్యూనిస్టుపార్టీ అంటే ద్వేషం ఉండవచ్చు. వారి పాలసీ నచ్చకపోవచ్చు. కాని, హిందూ ముస్లిం ఐక్యతనుగూర్చి ఏ దేశభక్తునికీ వ్యతిరేకత ఉండగూడదే! కాంగ్రెసుకూడా, గాంధీజీకూడా హిందూ ముస్లిం ఐక్యతనుకోరినవారేనే! అందుచేతనే జాతీయ గీతాలాపన పిమ్మట 'గాంధీ మహాత్మకుజై' తోబాటు 'అల్లాహోఅక్బర్' అని కాంగ్రెసు సభలలో అంటారు. కాని ముంగండ (తూ గో.) కాంగ్రెసు వాదులకు ఇవేమీ పట్టలా! కమ్యూనిస్టుపార్టీ ఇచ్చినదికాబట్టి ఐక్యతానినాదాన్ని ఎదిరించాలి అని వారి భావన. ఆగ్రామంలోవున్న పురమందిరానికి కమ్యూనిస్టుపార్టీ వారి వాల్‌పోస్టరు అతికించబడివుంది. హిందూముస్లిం సోదరులిర్వురు ఆయుధాలతో శత్రువునెదుర్కొనుట ఆ పోస్టరుపై చిత్రించబడి యున్నది. హిందూస్థానీలో 'దేశరక్షణకొరకు. దేశ స్వాతంత్ర్య సంపాదనకొరకు, హిందూముస్లిం సోదరులారా! ఏకముకండు!' అని వ్రాయబడివున్నది. ఈ పోస్టరు ఆ కాంగెస్సు వాదులనబడేవారికి ఆగ్రహకారణమైంది. వారు కొన్నాళ్ళు అపురమందిరాన్ని బహిష్కరించారు. కాని చెరువుపై అలిగితే ఏమిలాభం......! పరిస్థితి అంతేఅయింది. చివరకు సహించలేక, ఏరాత్రిపూటనోవచ్చి ఆపోస్టరును ముక్కముక్కలుగా చింపివేశారు ఈవిధంగానే స్వాతంత్ర్యాన్ని సంపాదిస్తారు కాబోలును ఈ స్వాతంత్ర్యవీరులు!

ఐక్యతావుద్యమం — దానిని ఎవరాపగలరు!

ఐక్యతావుద్యమమే అన్నిటిని సాధించగల సమరం అని కమ్యూనిస్టుపార్టీ నినాదం. ఈ ఐక్యతావుద్యమ ప్రభావాన్ని ప్రజాసామాన్యం నానాటికి అధిక అనుభవంమీద తెలుసుకొంటూంది. ప్రజాసామాన్యంతోపాటు అటు ప్రభుత్వవర్గమూ, ఇటు పంచమాంగదళ దేశద్రోహులు కూడా దీనిని గుర్తిస్తున్నారు. అందువల్లనే ప్రజాసామాన్యం సంఘటితం కాగల ప్రతి అవకాశానికి ప్రభుత్వవర్గం అంతరాయం కలిగిస్తూంది. పంచమాంగ నిబంధనల పేరిట కమ్యూనిస్టులకు ప్రజలకు మధ్య కంచెలు వేయడానికి ప్రయత్నిస్తూంది.

ఇటు పంచమాంగదళం- వీరి చర్యలు కొంచం విపులంగా పరిశీలిద్దాం-

ఏటి కెదురీత

అగస్టు 9 తరువాత రెండు వారాలవరకు దేశంలోని పరిస్థితులనుబట్టి చూస్తే- ఇక 'స్ట్రిగుల్‌వాలా' లదే రాజ్యం అనిపించింది. వెనుకా ముందూ ఆలోచించకుండా నిరంకుశాధికారులు ప్రారంభించిన చర్యలకు ప్రజానీకం కన్ను తెలియని కోపాతిశయంలో మునిగిపోయింది. సై అన్నవాళ్ళదే నాయకత్వం అంతాను ఆరోజులలో కమ్యూనిస్టులది ఏటి కెదురీత అనిపించింది.

రోజులు గడచినకొలదీ పరిస్థితులు చక్కబడుతూ వచ్చాయి. ఇన్నాళ్లూ తమ కొంపలకు తామే నిప్పంటించుకుంటున్నామని ప్రజాసామాన్యం గుర్తించారు. ఆగి, ఆలోచించడం ప్రారంభించారు. జాతీయైక్యత-జాతీయ ప్రభుత్వం-దేశరక్షణ- దేశస్వాతంత్ర్యం అని కమ్యూనిస్టులు పూరిస్తున్న శంఖారావం వారి కప్పుడు సుస్పష్టంగా వినిపించింది. అన్నిటికన్నా ముఖ్యం- ఐక్యతా సూత్రాన్ని కమ్యూనిస్టులు దైనందిన జీవితసమస్యలకు కూడా ఎలా అన్వయిస్తున్నారో, ఆసూత్రం ద్వారానే ఈ సమస్యలను కూడా పరిష్కరించడానికి ఎలా కృషిచేస్తున్నారో గమనించారు. ఆగస్టు 9 వ తేదీని పొంగిన పుద్రేకం, చల్లారడంతో ఏర్పడిన నిరాశ నిస్పృహలు మెల్లమెల్లగా అంతరించసాగాయి. ఆశ, ఆత్మ విశ్వాసం వాటిస్థానం ఆక్రమించడం మొదలయింది. విధ్వంసక చర్యలనుండి, ప్రజాసామాన్యమూ, నిజాయితీగల దేశభక్తులూ, నిర్మాణకార్యక్రమం వైపు మరలడం ప్రారంభించారు. సై అనేవాళ్ళ నాయకత్వం అంతరించింది. పంచమాంగదళ దేశద్రోహులు ప్రజలనుండి విడిపడ్డారు- ఒంటరిగాళ్లయిపోయారు. నేటిపరిస్థితులివి.

ప్లేటు మారింది

ఇక పంచమాంగదళంవారి ప్లేటు మారింది. సై అనేవారి చర్యలు కొత్తదారి తొక్కాయి- ప్రజలు తమ చేతుల్లోంచి జారిపోతున్నారు- వారిని దక్కించుకోడం వీరి తరంకాదు. దీనంతటికీ కమ్యూనిస్టులేకదా కారణం - "సరే యిక వారి పని పడదాం" అని నిశ్చయించుకున్నారు - యీ 'ప్రజా నాయకులు.' ప్రజానాయకత్వానికి నీళ్ళు వదిలి - రౌడీ నాయకత్వానికి నడుం బిగించారు. ఇంతకుమించి వారికి గత్యంతరం లేకపోయింది. ప్రజాస్వామిక సూత్రాలకు స్వస్తిచెప్పారు - ప్రజా సంస్థలను భగ్నంచేయ మొదలెట్టారు - సభలను చెదరగొట్టడానికి సాహసించారు - అమాయక ప్రజలను బెదరించి, లొంగ దీసుకోడానికి తెగించారు. మలబారులో నేటి దృశ్యమిది.

ఈ సందర్భంలో మనం ఒక విషయం ఆలోచించాలి. ఈ ఘాతుక చర్యలకు ఒడికడుతున్న దెవరు? వీళ్ళందరూ దేశాభిమానులేనా? కాంగ్రెసువాదులేనా? ముమ్మాటికి కాదు. కాంగ్రెసువాదులూ, దేశాభిమానులూ యెన్నటికీ పంచమాంగదళంవారు కారు. అయితే మరి యెవరు?

1. కొంతమంది కాంగ్రెసు వాదులలో, మొదటినుంచీ పురోగామి వ్యతిరేక భావాలు, యిప్పటి తప్పుడు చర్యల ఫలితంగా అతిశయించి, జపాను అనుకూల భావాలుగా మారాయి. ఇటువంటివారు కొద్దిమంది మాత్రమే.

2. కమ్యూనిస్టులంటే సింహ స్వప్నంగా వున్న కొద్దిమంది ధనికులు, భూస్వాములున్నూ, వారి అనుచరులున్నూ. కేరళరాష్ట్ర కాంగ్రెసు కమిటీ కమ్యూనిస్టుల చేతిలో వున్నప్పుడు దానిమీద దండయాత్ర సాగించడం కోసం ఈ అనుచరులే కేరళరాష్ట్ర గాంధీసంఘం అని ఒకసంస్థను స్థాపించారు.

3. కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ ప్రజల్లో మెలగుతూ, ప్రజల కష్టసుఖాలను గమనిస్తుండడం చూచి సహించలేని కొంతమంది అధికారులు.

4. అంతవరకు పార్టీసభ్యులుగా వుండి, 1940 సెప్టెంబరు 15 తరువాత ప్రభుత్వం అమలుజరిపిన తీవ్రవిధానానికి తాళలేక కమ్యూనిస్టుపార్టీకి దూరమయిన కొంతమంది వ్యక్తులు.

5 బర్మా, మలయాల నుండి వచ్చిన కొందరు కాందిశీకులు. వీరు తమతోపాటు, తమ పంచమాంగదళ తత్వాలను కూడా, మన దేశానికి దిగుమతి చేశారు.

కలిపి కడుతున్న దేమిటి?

ఇప్పటి ఘాతుకచర్యలకు సారథ్యం వహిస్తున్నది వీరు ఇన్నికాల వారిని ఈనాడు కలిపి కడుతున్న దేమిటి? బ్రిటిష్ వ్యతిరేకతా? జపాన్ అనుకూలతా? సమరోత్సాహమా? ఐక్యతావిముఖత్వమా? పరిశీలించి చూస్తే వీరిని కలిపికడుతున్నది వీటిలో ఏదీ కాదని తెలుతుంది. కమ్యూనిస్టులంటె వీరికున్న మంటే వీరందరినీ కలిపి కడుతున్నదని స్పష్టమవుతుంది. ఈనాడు బ్రిటిషు నిరంకుశాధికారం కమ్యూనిస్టుపార్టీని నలిపి నాశనం చేయగలిగితే పండగ చేసుకొనబోయేది వీరే. కమ్యూనిస్టులను హతమార్చడంలో బ్రిటిషు వారికన్న ఫాసిస్టు నరహంతకులే మొనగాళ్ళని వీరి దృఢనమ్మకం. అందుకనే దేశాన్ని పంచమాంగదళ చర్యలకు రెచ్చగొట్టడానికి వీరు శక్తికొలది కృషిచేస్తున్నారు.

వీరు మొదట్లో "బ్రిటిషువారు ఇండియాను వదిలి పోవా"లని నినాదం ఇచ్చారు - "జపాను ద్వారానే ఇండియాకు స్వాతంత్ర్య మ"న్నారు. ఈ నినాదాలు విఫలమయ్యాయి ఇప్పుడు వీరి ముఖ్య నినాదం, "కమ్యూనిస్టులారా, మీ పంథా మార్చుకోండి" అని. కమ్యూనిస్టు లేర్పాటు చేసే సభలలోకి వీరు పనికుర్రవాళ్ళను పంపి యీ నినాదం అరిపిస్తున్నారు పాపం. యీ కుర్రవాళ్ళకు కమ్యూనిస్టుల పంథా యేమిటో, యేమి మార్చుకోవాలో - యివేమీ తెలియవు. చిలుకపలుకులు వల్లెవేయడం మాత్రం తెలుసు. ఒకొక్కప్పుడు అన్నీ తెలిసిన పెద్దలే వస్తుంటారు. అయితే ఆ పని కుర్రవాళ్ళకీ వీరికి వున్న భేదం యేమిటంటే - వాళ్ళు యేమీ తెలియక వాదనకు దిగరు; వీరు అన్నీ తెలిసినా దమ్ములేక వాదన పెట్టుకోరు "మీపంథా మా పంథా ప్రజలయెదుట పెట్టి చర్చిద్దాం" అని కామ్రేడ్సు యెన్నిసార్లు సవాల్ చేసినా ముందుకురారు. సక్రమమైన విధానం వుండేగా ఆత్మ విశ్వాసం వుండడానికి! ఏవో అరవడం, అది సూచనగా తీసుకొని వారి అనుచరులు రాళ్లు విసరి సభను చెదగొట్టడానికి ప్రయత్నించడం,

కమ్యూనిస్టులను పట్టుకు కొట్టడం, యివే వీరి కార్యక్రమం. దీనివల్ల నష్ట పడుతున్నది కమ్యూనిస్టు లెంతమాత్రం కాదు. ఈ విధ్వంసములే యీ చర్యలవల్ల పూర్తిగా ప్రజలనుండి దూరమౌతున్నారు-ఎందు మోడుల్లాగ మిగిలిపోతున్నారు. అలనిల్: కననూర్, కాదిరూర్, చింబాల్, కాలికట్ నగరాలలో జరిగిన సభలన్నింటిలో యిదేతతు సభ స్వభావం ఏమిటి, దాని ఆశయా లేమిటి - ఇవేవీ వీరికక్కర్లేదు.

కాదిరం అనే గ్రామంలో లోగడ అక్టోబరు 3 వ తేదీని గ్రామస్తులు మన వాలంటీర్లను పట్టుకు కొట్టారు. ఈ గ్రామం ఒక కమ్యూనిస్టు పార్టీ ద్రోహి స్వస్థలం. ఈ ద్రోహిని బట్టబయలు చేయకపోవడం ఒక పొరపాటని కామ్రేడ్సు వెంటనే గుర్తించారు. ఇక ఇంటింటికి వెళ్ళి వాడి సంగతి తెలిపారు. కొసకి గ్రామస్తులే మన కామ్రేడ్సుని పిలిచి సభను యేర్పాటు చేశారు. కాలికట్‌లో ఒక సభను యేర్పాటు చేసేసరికి, కొంతమంది సిద్ధంగా నిలుచున్నారు - రాళ్ళ కుప్పల దగ్గర మన కామ్రేడ్సు హుషారుగా వున్నారు. రౌడీలు విసరిన ప్రతి రాయిని యెత్తి ప్రజలకుచూపారు ఒకడు రాయిని విసురుతుండగా పట్టుకున్నారు. ఇక మిగిలిన పుణ్యాత్ములు! అక్కడెందుకుంటారు?

ప్రస్తుతం దేశమంతటా జరుగుతున్న సంఘటనలకు ఇవి వుదాహరణలు. జపాను ఫాసిజాన్నెదుర్కొడానికి, బ్రిటిషు ప్రభుత్వాన్ని లొంగదీసి దేశ స్వాతంత్ర్యాన్ని సాధించడానికి ఐక్యతా పుద్యమాన్ని వుద్దేశించారు. కాని దేశద్రోహులను, ప్రజాశక్తి విధ్వంసకుల్ని బయటపెట్టి, వారికి నిలువనీడ లేకుండా చేయడంలో యిది బ్రహ్మాస్త్రంగా పరిణమించింది.

జపానుకు ఛాలెన్జ్

"ఏమిచేస్తావో చేసుకో. నన్ను లొంగదీయడం నీతరంకాద"ని చిటగాన్గ్ జపానును ఛాలెన్జ్ చేస్తూంది. బాంబులను కురిపిస్తారా. అచంచలమైన ఐక్యతతో ఎదుర్కొని ఆ బాంబులను నిరుపయోగం చేస్తాం! ఇప్పటి పిచ్చి ప్రభుత్వం మాకు ఆయుధాలివ్వరా. ఇవ్వకపోతేపోనీ. ఐక్యత అనే బ్రహ్మాస్త్రంతోనే అన్నిటినీ సాధిస్తాం! పంచమాంగదళం ఆటలు ఎంతవరకు సాగుతవో చూస్తాం! ఇదీ క్లుప్తంగా చెప్పాలంటే చిటగాన్గ్ ప్రజల మనోవైఖరి. చిటగాన్గ్ ఇప్పటి కప్పుడే ఎన్నోసార్లు జపాన్ బాంబుల్ని ప్రతిఘటించి నిలచింది. ఆ నగరానికున్నంత ప్రమాదం ఇప్పట్లో మరేనగరానికిలేదు ఈ నగరం ఇంత ధైర్య, సాహసాలు, ఆత్మవిశ్వాసం ప్రదర్శించడానికి కారణం!

కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన 35 ప్రచారకదళాలు నగరం మూల మూలకు ఐక్యతా సందేశాన్ని అందజేశాయి. 821 గ్రూపుమీటింగులు, 25 మహాసభలు జరిగాయి. 'ఐక్యతా సందేశం' అనే కరపత్రం 1488 ప్రతులు పంచిపెట్టారు. ఈ సందేశాన్ని విననివారులేరు. దానిని విశ్వసించనివారులేరు. ఐక్యతావారంలోనే 7 నగరరక్షక కమిటీలు ఏర్పడ్డాయి- 589 మంది పీపుల్సు వాలంటీర్లు చేరారు.

చిటగాన్గ్ సంరక్షణకు సాగుతున్న ఈ ఐక్యతావుద్యమంలో స్త్రీలు ఎంతోవుత్సాహంతో ముందుకు వచ్చారు. ఆ ప్రాంతంలోని కర్షక స్త్రీలకు సంతకంపెట్టేపాటి చదువయినాలేదు. కాని మన ఐక్యతా సందేశాన్ని విన్నతరువాత, మన మానిఫెస్టోలమీద వేలుముద్రలు ఎంతో వుత్సాహంతో- ఆశతో వేశారు. ఒకచోటఒక వృద్ధురాలు మన కామ్రేడ్సు చెప్పినమాటలను వినడంతో తృప్తిపడలేదు. వారివెంట ఇతర ప్రదేశాలకు కూడా వెళ్ళి, ఇతరస్త్రీలలో ఐక్యతా సందేశాన్ని ప్రచారంచేసింది. వాళ్ళచేత సంతకాలు పెట్టించింది ఢల్ఘాట్‌లో జరిగిన 71 గ్రూప్‌మీటింగులు జరిగాయి. వీటిలోపాల్గొన్న 939 మందిలో 538 మంది స్త్రీలే. తమ ప్రదేశాలను ఫాసిస్టులు ఆక్రమించుకోవడం అంటే ఏమిటో- ఆ ఆక్రమణలో స్త్రీలు ఎలాంటి పరాభవాలపాలవుతారో మన కామ్రేడ్సు వివరిస్తున్నారు ఆత్మరక్షణోపాయాలను బోధిస్తున్నారు.

ముస్లిములతో ఐక్యత అసంభవమని కొందరివాదన. వీరికి తగిన సమాధానం చెబుతూంది చిటగాన్గ్ ఐక్యతావుద్యమంలో మన వారు ఒకరోజున "మైనారిటీలహక్కుల దినం" జరిపారు. ఆనాటి సభలో మైనారిటీ హక్కులను గురించి మాట్లాడడమే కాకుండా, ఈ హక్కులకోసం జయప్రదంగా పోరాడాలంటే కాంగ్రెసు నాయకుల్ని విడిపించడం ఎంత అవసరమో తెలియజేశారు ముస్లిం లందరో పతండాలుగ కాంగ్రెసు నాయకుల విడుదల పిటిషన్‌మీద సంతకాలు చేశారు.

ప్రజల ఇబ్బందుల్ని అవకాశంగా తీసుకొని అతిశలాభాలు సంపాదించేవార్కి, నిరంకుశులకి, దేశద్రోహులకి, ఈ వుద్యమం మహాకంటకంగావుంది. ఈ వుద్యమానికి ప్రతివుద్యమంగా కమ్యూనిస్టుల మీద విషప్రచారం ప్రారంభించారు. కమ్యూనిస్టుల్ని అరెస్టు చేయించారు. ఎన్ని అవాంతరాలు కలిగినా మనవారు మాత్రం దేశంపట్ల తమబాధ్యతను నిర్వర్తించడం మానలేదు.

పార్టీ ఫండు

20-12-42 వరకు

	(అణాలలో)
విశాఖ	102-11-3
తూ॥ గో॥	884-8-0
ప॥ గో॥	812-5-3
కృష్ణా	4290-13-7
గుంటూరు	11015-14-9
నెల్లూరు	5240-14-6
చిత్తూరు	15-7-0
కడప	21-14-0
అనంతపూర్	101-0-0
కర్నూలు	68-0-0
రైల్వే	119-0-0
రాష్ట్ర కమిటీ	13432-8-0
	36104-6-4

రైతు కూలీ సమస్యలు

ఎటుచూచినా ★

"ఆహారపదార్థాలను అధికంగా ఉత్పత్తి చేయాల"ని ప్రభుత్వంచే పెద్దపెద్ద ప్రదర్శనాలూ, ప్రణాళికలూ మొదలైన అర్భాటం చేయబడుతోంది కాని- ఆచరణలోమాత్రం ప్రభుత్వోద్యోగుల చర్యలు అగమ్యగోచరంగా ఉంటున్నాయి. కొన్నికొన్నిచోట్ల సాగుకు లాయకైన బంజరుభూముల్ని సాగు చేయటానికి మంజూరు చేయటంలేదు. మరికొన్నిచోట్ల ప్రజల నిత్యజీవితావసరముల కుపయోగించే ప్రదేశాలను ప్రజల సమ్మతి లేకుండానే సాగుచేయించుచున్నారు.

అధికాహారోత్పత్తికి ఆధారభూతులైన ప్రజల సహాయ సానుభూతులవల్లనే కావాల్సినంత ఆహార సామగ్రిని ఉత్పత్తి జేయించవచ్చుననే ప్రాథమిక సూత్రాల్నికూడా ప్రభుత్వోద్యోగస్థులు మర్చిపోతున్నారు. ప్రజల కష్టాలకు దారితీసే, ప్రజాజీవితానికడ్డుకల్గించే పద్ధతులవల్ల ఆహారోత్పత్తి పెంపొందటానికి బదులు క్షీణించుతుందన్న విషయాన్ని అధికారులు గుర్తించలేకపోతున్నారు.

బందరులో బందరు కోటచుట్టూ ఒక కందకముంది. ఆకందకాన్ని కొన్ని తరాలనుంచి చెరువుగాఉపయోగించు కొంటున్నారు. ప్రతి రోజూకొన్నివేల పశువులు ఆచెరువునీరేత్రాగుతుంటాయి. బందరు కోటకు ఆకందకం తప్ప మరో చెరువులేదు. అధికాహారోత్పత్తికిగాను సాగుచేయటానికి యీకందకాన్ని ఒక షాహుకారుకు మంజూరు చేయబోతున్నారు. ఆచెరువుని పూడిస్తే- గ్రామస్థుల కనేక యిబ్బందులు కలుగుతాయి! పశువులు నీళ్ళులేక అల్లల్లాడవలసి వస్తుంది. పశుపోషణపై జీవించే వందయాదవకుటుంబాలు మలమలమాడి పోవలసివస్తుంది. యీవిషయాన్ని అధికారులకు తెలియజెప్పుకోటంకోసం- రెండువవల మంది సంతకాలుచేసి మహజర్లు పంపుకున్నారు. గ్రామస్థుల తరపున కొందరు పెద్దలు తహశీలుదారుగారి వద్దకూ, కలెక్టరుగారివద్దకూ రాయబారం వెళ్ళారు. వారు, "ఆలోచిస్తాంలే" అన్నారు. యీవిషయంలో ప్రభుత్వాధికారులు ప్రజలయిబ్బందులను గుర్తించి- ఆకందకాన్ని సాగుకు మంజూరు చేయకుండా ఉండాలి.

మాకొద్దీ జమీందార్ల పొందు

వెంకటగిరి ఎస్టేటు రైతులు, ఈ సంవత్సరం వర్షాలు లేకపోవటంవల్ల, పంటలుపండక అల్లల్లాడిపోతున్నారు. పండినా-ఎండినా శిస్తు మాత్రం తప్పదనే జమీందారీ ఉద్యోగస్థుల జులుం హద్దూ పద్దూ లేకుండా సాగిపోతూనేఉంది. పంటలు పండక దుర్భర దారిద్ర్యంతో క్రుంగిపోతున్న రైతు కుటుంబాలు, "శిస్తులు చెల్లి చలేము" రెమిషనివ్వండి, అని గగ్గోలు పెడుతున్నా, అవుల్నో, దూడల్నో, పాత్రసామానో జప్తులు చేయటంమాత్రం రోజురోజూ సాగిపోతూనేఉంది. కూలీల పరిస్థితి మరింత దుర్భరంగాఉంది. పంటలుపండకపోవటంచేత పనిపాటలులేవు. ఏపనైనా చేసి బేడలబ్బులు తెచ్చుకుందామంటే గంజినీళ్ళకు చాలటంలేదు. సజ్జలకీ, రాగులకీ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎటుచూచినా సామాన్య ప్రజానీకం యీ యిబ్బందులతో గిలగిల్లాడుతున్నారు.

ఇన్నిఅవస్థలు పడుతున్నా యీ రైతాంగంపై జమీందారీ నౌకర్ల జులుం మాత్రం తప్పటంలేదు.

ఉదాహరణకు "ఎగువలింగ సముద్రం" గ్రామం సంగతి చూడండి. గత ఎసెంబ్లీ ఎన్నికల్లో యీ గ్రామస్థులంతా కాంగ్రెసుకు ఓటుచేశారట అందువల్ల యీ రైతుల్ని ఎలాగైనా సాధించాలనే పంతంతో జమీందారీ ఉద్యోగస్థులు కత్తి వెళ్ళగక్కుకుంటున్నారు. ఈ గ్రామానికి చుట్టూ అరణ్యముంది. అందువల్ల తెల్లవారితే చాలు పశువులు అడవిలోకి వెళ్ళితీరాలి. పశువుల మేతకోసమని గ్రామం తరపున అడవి పాడుకున్నా పశువుల్ని సకాలంలో మేత మేయనీయకుండా జమీందారీ నౌకర్లు అటకాయిస్తున్నారు. క్రిమినల్ కేసులు బనాయించి, గిల్లికజ్జాలను రేపెట్టి, అదిరించీ బెదిరించీ, రైతులదగ్గర లంచాలు గుంజుతున్నారు రైతుల యిండ్లపై పడి భోజనాలు పెట్టమని నిర్బంధిస్తుంటారు. కరువు కాటకాలు వచ్చినా శిస్తు రెమిషన్ ఇచ్చినపాపాన పోలేదు. సామాన్య జీవితనిర్వహణమే దుర్భరంగాఉంది "ఆలోలక్ష్మణా" అని వెంకటగిరి జమీన్ రైతులు అలమటించి పోతున్నారు.

రంగాపురం జమీందారు పోరంబోకల్నే మ్రింగేస్తున్నాడు.

కృష్ణాజిల్లా కైకలూరు తాలూకాలో కొర్రగుంటపాలెం అగ్రహారంఉంది. ఈ అగ్రహారం రంగాపురం జమీందారుది. చిరకాలంనుంచి రైతులు సాగుచేసికొంటున్న భూమిని ఆక్రమించుకోవాలని దావాలువేసి ప్రీవీకౌన్సిలుదాకా వెళ్ళి రైతుల్ని ముప్పతిప్పలుపెట్టి వేధించుకుతింటున్నాడు. ఇంతటితో తృప్తితీరక రైతులచే కిరాయిలు తోలించుకొని బాడుగివ్వకుండా ఏడ్పించుకుతింటున్నాడు పోరంబోకల్లోకి రైతుల పశువులను రానివ్వకుండా అటకాయించి బందిలిదొడ్లో పెటుతున్నారు. కాంగ్రెసు మంత్రివర్గం రోజుల్లో రైతులు రివెన్యూ మంత్రికి విన్నవించుకొని పోరంబోకల్లో తమకు హక్కుందని ఆర్డర్లు తెపించుకొన్నారు. కాని, ఆజమీందారు పోరంబోకల్నే గుటకాయస్వాహా చేస్తున్నాడు. పాతసర్వేలో పోరంబోకలు, రీసర్వేలో బ్లాకులుగా తయారయిపోయాయి. జమీందారు స్వంత కమతాలు సాగుకానిదే రైతుల భూములు సాగుచేసికోటానికి అస్కారంలేకపోతోంది.

జమీందారుల ఇలాంటి జులుముల వల్లనే "బాబో, మాకొద్దీ జమీందార్ల పొందు" అని జమీన్ రైతులు ఘోషిల్లుతున్నారు.

నర్సరావుపేట తాలూకాలో రైతులగోడు

ఈ సంవత్సరం యీ తాలూకాలో బీద ప్రజానీకపు జీవితం విషమరూపం దాల్చింది. యీ తాలూకాలోని ప్రజలందరకు మెట్టపైరే జీవనాధారం. సకాలంలో వర్షాలు లేకపోవుటవల్ల పునాసపైరు పండలేదు. పైరున వేసిన పుగాకు మొదలగు వ్యాపారపు పంటలు, జొన్న వరిగ మొదలగు ఆహారపు పైరులు పూర్తిగా ఎండిపోతున్నై. చెరువులలో నీరులేక రూపినగుంట, చీమలమర్రు, చల్లగుండ్ల, నకరికల్లు మొదలగు గ్రామాలలో వరిపైరుగూడా ఎండిపోయింది. రైతులు మేతలేక పశువులను కసాయివాడికి అమ్ముతున్నారు. ఆహార పదార్థములు కొనలేక, బీదప్రజలు కొట్టుకులాడుతున్నారు.—కాన

1 ప్రభుత్వం ప్రజల అందుబాటులో అంగళ్లు పెట్టి ధాన్యం చౌక ధరలకు సరఫరా చేయాలి;
2 భూమిశిస్తుపూర్తి రెమిషన్ యివ్వాలి.
3 కరువుపనులు విరివిగా ప్రారంభించాలి.
4 అధికలాభాలను అరికట్టి సరకులకు కనీస గరిష్ఠధరలు నిర్ణయించాలి.
5 విదేశములకు ధాన్యపు ఎగుమతి ఆపు చేయాలి.

బుడమేటి స్కీములను వెంటనే అమలుపర్చాలి.

యీనెల 16 వ తారీఖున గుడివాడలో శ్రీ ముక్కామల నాగభూషణంగారి అధ్యక్షతను కృష్ణాజిల్లా రైతుసంఘ కార్యవర్గం సమావేశమైంది. చాలకాలంనుంచి రైతులు, రైతు సంఘాలు కొనసాగించిన ఆందోళనాఫలితంగా మద్రాసు ప్రభుత్వము బుడమేటి ముంపు నివారణకు స్కీమును తయారు చేయుటకై ఒక స్టాఫ్‌ను నియమించి పని ప్రారంభించినందుకు యీ సమావేశం వారు సంతసిస్తున్నారు. స్కీములు తయారు చేయించటమేకాక వెంటనే కార్యాచరణకూడ ప్రారంభించాలని ప్రభుత్వానికి తెలియజేస్తూ, ఈ విషయంలో రైతులు సమగ్రమైన ఆందోళన సాగించాల్సినదిగా హెచ్చరించారు.

ప్రస్తుతము కృష్ణాజిల్లా ఇరిగేషన్ ఛీఫ్ యింజనీయరుగా ఉన్నవారి ఉద్యోగకాలాన్ని బుడమేటి వగైరా ముంపు నివారణపనులు పూర్తియగువరకు మరొకసంవత్సరం పొడిగించాల్సినదిగా యీ సమావేశంలో కోరారు;

నందిగామ, నూజివీడు, తిరువూరు తాలూకాలలోనూ బెజవాడ మెట్ట ప్రాంతాలలోనూ, గన్నవరం, వీరవల్లి ఫిర్కాలలోనూ సకాలంలో వర్షాలు లేకపోవటంవల్ల పంటలన్నీ ఎండిపోయాయి. అందువల్ల ప్రభుత్వం సిస్తు రెమిషన్ (జమీందారీ గ్రామాలలో కూడ) ఇప్పించాలి. చౌకధాన్యం డిపోలు ఏర్పాటు చేయించాలని ఒక తీర్మానంజేశారు

ఈ జిల్లాలో కొందరు రైతుకూలీలు ప్రభుత్వపు అధికాహారోత్పత్తి కార్యక్రమాన్ననుసరించి కొన్ని భూముల్ని సాగుచేయుటకు ప్రభుత్వానుమతి (ఆర్డరు) పొందువరకు వేచియున్న యెడల సాగుసమయం మించిపోపునని సకాలంలో సాగులుకూడా చేశారు. కాన ప్రభుత్వం ఆట్టిభూములకు పెనాల్టీలు విధించకుండా అధికాహారోత్పత్తి కార్యక్రమం ఎడల ప్రజలకు చక్కటి ప్రోత్సాహం కల్గించవలెనని యీ సమావేశంవారు కలెక్టరుగారికి తెలిపారు.

దివితాలూకా రైతు సంఘం

ఈ నెల 11 వ తేదీని చల్లపల్లిలో కోనేరు సత్యనారాయణ గారి అధ్యక్షతను తాలూకా రైతు సంఘ వర్కింగు కమిటీ సమావేశమైంది.

సాముదాయక జరిమానాలను రద్దుచేయించుటకు కలెక్టరుగారి వద్దకు రాయబారం వెళ్లటానికి, తాలూకా రైతుసంఘం తరఫున వసూళ్ల సమయంలో ధాన్యరూపంగా విరాళాలువసూలు చేయటానికి, రైతుసంఘంలో సభ్యులను విరివిగా చేర్పించటానికీ తీర్మానించారు.

దివితాలూకా వ్యవసాయ కూలీ సంఘాధ్యక్షుడైన గరికపాటి వెంకటరత్నంగారిపై దౌర్జన్యం ప్రయోగించిన సబిన్‌స్పెక్టరు చర్యను ఖండిస్తూనూ, అఖిలభారత రైతుసంఘ తీర్మానాలకు వ్యతిరేకంగా ప్రవర్తించినపేకేటిరంగారెడ్డిగారిని సభ్యత్వంనుంచి తొలగించుచూ ఆ స్థానంలో దొక్కు వెంకటేశ్వర్లుగారిని కోఆప్టు చేసికోటానికిహూడా తీర్మానాలు జరిగాయి.

★ రైతులకు కడగండ్లేనా!

దివి తాలూకా కొక్కిలిగడ్డ శివారు కొత్తపాలెం గ్రామ రైతు సంఘం వర్కింగుకమిటీ యీ నెల 12 వ తారీఖున సమావేశమై అ. భా. రైతుసంఘము నుండి విడిపోవటానికి తీర్మానించిన రాష్ట్రరైతు సంఘం వారిచర్యను ఖండించారు భారత దేశ రక్షణలను బలపర్చటం కోసం జాతీయనాయకుల్ని విడుదల చేసి జాతీయ ప్రభుత్వ స్థాపనకు పూనుకోవాల్సిందని ప్రభుత్వానికి హెచ్చరిక పంపారు.

సాముదాయక జరిమానాలను రద్దుచేయండి

సాముదాయక జరిమానాలను రద్దుచేయాలనే ఆందోళన రోజురోజుకూ హెచ్చౌతుంది; బాపట్ల తాలూకా జూపూడి, కోడూరు, గ్రామస్థులు వంద సంతకాలతో ప్రభుత్వానికి మహజరు పంపారు. తెనాలి తాలూకా మంచికలపూడి గ్రామస్థులు రెండువందల సంతకాలతో మహజరుపంపి, ప్రభుత్వాధికారులవద్దకు రాయబారం వెళ్ళారు. తెనాలినుంచి మద్రాసు గవర్నరు వద్దకు రాయబారం వెళ్ళిన వర్తకులకు "ముందు పన్ను చెల్లించండి తరువాత ఆలోచిస్తామని" గవర్నరు శలెవిచ్చిన సమాధానమిచ్చాడు.

సవరణలు

1. క్రిందటిసంచిక సంపాదకీయంలో మిర్చి రు 6 నుండి రు 12 లకు పెరిగిందనడానికి రు 4 నుండి రు 9—8—0 కు పెరిగిందనీ, మంచినూనెవీసె రు 0-12-0 నుండి రు 1—4—0 కు బదులు 0—3—0 నుండి రు 0—7—9 కు పెరిగిందనీ పొరబాటున పడింది.

2. 5 వ పేజీ ఆఖరు కాలంలో ఈ విధంగా వ్రాయబడింది: "భారతదేశం నేడు..... ప్రపంచ ప్రజలందరు కలిసి పోరాడే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనాలనియు:....అట్లు పాల్గొనుటకు ముందు కాంగ్రెసు - లీగ్ ఐక్యత యేర్పడాలనియు ...." " అట్లు పాల్గొంటూ కాంగ్రెసు—లీగ్ ఐక్యతకై కృషి చేయాలనియూ" అని వ్రాయడానికి బదులు పై విధంగా పొరపాటు వ్రాయబడింది. యుద్ధ ప్రయత్నాలను బలపరుస్తూ, మరొకపక్క కాంగ్రెసు—లీగ్ ఐక్యతకై భారతీయులు కృషి చేయాలని కమ్యూనిస్టు పార్టీ అంటుంది. జాతీయైక్యత కుదిరేవరకు యుద్ధ ప్రయత్నాలలో పాల్గొనకూడదనడం పొరబాటు.

3. 9 వ పేజీలో 'అధికార దుర్వినియోగం' అనే శీర్షిక క్రింద "మహిళాసంఘ ఆర్గనైజరు అక్కడికి వచ్చి" అని పడింది. "తాలూకా కమిటీ (కమ్యూనిస్టు పార్టీ) ఆర్గనైజరు అక్కడికి వచ్చి" అని వుండాలి.

4. 9 వ పేజీలో "చల్లపల్లిలోఖద్దరు అమ్ముతున్న కామ్రేడ్సును అరెస్టు చేసి" అని వుంది. "అవనిగడ్డలో" అనుటకు బదులు "చల్లపల్లిలో" అని పడింది.

నాదెజ్దా చెకాలినా
మూలం

నా బిడ్డ

అనువాదం
వి. మధుసూదనరావు

బ్రతికుంటే మా షురా కిప్పుడు 17 వ సంవత్సరంవచ్చివుండేది. వాడు 1925మార్చి 17వ తేదీని పుట్టాడు. వానిది చక్కని ఆరోగ్యం, మంచి దేహదారుఢ్యం. నాకు ఎప్పుడూ ఏ యిబ్బంది కలుగజేయలేదు. ఎప్పుడూ సంతోషంగా వుండేవాడు. వాడు ఎట్లా పెరిగింది నాకు బాగాతెలుసు. నా భర్త చాలనిపుణతగల వేటగాడు. షురా చాల చిన్నతనంలో తన తండ్రివెంట అడవులకు పోయి తుపాకీతో కాల్చటం నేర్చుకున్నాడు. ఆ విషయంలో వాడికి అడ్డురాకుండా వుండటం మంచిదని మేము భావించాము. చాల చిలిపితనం, తలబిరుసుగలవాడైనా, ఎప్పుడూ ఎవ్వరినీ ఏచెడ్డ మాట అని ఎరుగడు. ఇంటివద్ద పనిపాటల్లో చాల సహాయం చేస్తుండేవాడు.

వాడు మనసునిలకడ కలవాడు. ఏదైనా పనిలో పడ్డాడంటే మిగతా ప్రపంచాన్ని మరచిపోతాడు. మొదలుపెట్టినపని పూర్తిఅయ్యేదాక వాడికి నిద్రేపట్టేదిగాదు. షురా మాటతప్పే మనిషి కాదని మా కందరకు తెలుసు. మా కుటుంబంలో వాడిని "వీరుడు" అని పరిహాసానికి పిలిచేవారు. అది సకారణమే. ఎందుకంటే అతను చాల చిన్నతనంలోనే మంచి ఒడ్డు పొడుగు పెరిగి, మంచి దృఢకాయుడయ్యాడు. "మీపిల్లవా డెంతచక్కనివాడమ్మా" అని ఇరుగూ పొరుగూ నాతో అనేవారు. "విశేషమేముంది." అని వాళ్ళకు సమాధానం చెప్పి నేను ఒక చిరునవ్వు నవ్వేదాన్ని. కాని నా మనస్సులో అవి నిజమేగదా యని గర్విం చేదాన్ని. వాడు చదువుకొనేటప్పుడు కూడా సూక్ష్మబుద్ధి, మంచి జ్ఞాపకశక్తి కనబరచేవాడు. షురాదగ్గర చదువుకుంటానికి మా యింటికి వచ్చిన పిల్లలు చేసిన గల్లంతు, ఆ దృశ్యం, గుర్తువచ్చినప్పుడల్లా నా హృదయం నీరవుతుంది. షురా అన్నీ తెలిసినవాడిలాగా వాళ్ళకు బోధించేవాడు. వాడి తమ్ముడైన విక్టర్‌తో చాల స్నేహంగా వుండేవాడు. వాళ్ళిద్దరు ఒక గదిలోనే వుండేవారు వాడికి చదువంటే అమితాసక్తి. శాస్త్రము, పరిభాష (టెక్నొలజీ) మొదలయిన పుస్తకాలంటే చాల యిష్టంగా వుండేవాడు. పత్రికలకు చందాలుకూడ కట్టేవాడు. గోర్కీ, టాల్‌స్టాయ్‌ల రచనలను అమితంగా ప్రేమించేవాడు.

యుద్ధం వచ్చింది. షురాకి జర్మనీవాళ్ళని చీల్చి చండాడాలనే వుద్దేశం కల్గింది. "అమ్మా ఇది చాల భయంకరయుద్ధ మవుతుంది. అయినా ఫరవాలేదు. నేనూ నాన్న త్వరలోనే పోరాటానికి పోతాము." అని ఒకనాడన్నాడు. అతన్ని ఆపటానికి వీల్లేదని నాకు తెలుసు. ఆపనూ వద్దనుకున్నాను. నేనేం పిరికిపందనా ఆపడానికి ! నా బిడ్డలకు అపాయాన్ని ఎదుర్కోటాన్ని కూడ బోధించాను. ఆరు సంవత్సరాలు గ్రామ సోవియట్‌కు చైర్మనుగా పనిచేశాను. చాలాసార్లు గ్రామస్థుల్ని ప్రజాద్రోహుల దండయాత్రల నుండి రక్షించాను. వారిలో కొందరు నన్ను దూషించి, పగ తీర్చుకుంటామని బెదరించారు. కాని ధర్మమునావైపుననే వున్నదని నాకు తెలుసు. అందుచేతనే ఎప్పుడూ వెనుకంజ వేయలేదు. ఐనాముద్దుబిడ్డను యుద్ధరంగంలోకి పోతున్నాడంటే తల్లి హృదయం బాధపడక తప్పదు.

గెరిల్లాదళంలోకి గెరిల్లాలను చేర్చుకోవటం ప్రారంభం కాగానే, షురా తనంతట తానేవెళ్ళి చేరుతానన్నాడు. కాని చాల చిన్నవాడవుటచేత అతన్ని వద్దన్నారు. తరువాత ప్రజారక్షణదళాలు ఏర్పరుపబడ్డాయి. ఒకనాడు, పెద్దపెద్ద గడ్డములు వచ్చినవారిప్రక్కనే షురా కూడ మార్చింగ్ చేయుట చూచాను. చివరకు, ఎలాగయితేనేం, తన్ను గెరిల్లాదళంలో చేర్చుకునేటట్టు సైనికాధికారుల్ని ఒప్పించాడు. మా షురా, ప్రధానశ్రేణుల నుండి విడగొట్టబడిన జర్మన్ సైనికులను, వేటాడటానికి వాడు అడవులకు పోయిన రోజులు నాకు బాగా జ్ఞాపకమున్నాయి. ఒక్కొక్కసారి వెళ్ళిన 4, 5 రోజులదాకా తిరిగి వచ్చేవాడుకాడు. కొన్నిసార్లు అతనిమీద ఆశలు పూర్తిగ ఒదులుకొనేవాళ్ళం. ఉన్నట్టుండి ఒక్కసారిగా దూరాన పాటలు, గుఱ్ఱపుడెక్కల చప్పుడు వినబడేది. మా షురా మళ్ళీ కంటికి కనబడేవాడు. పిల్లలంతా చాల సంతోషంగా వుండేవారు. ఈమధ్య ఎఱ్ఱసైన్యం (రెడ్‌ఆర్మీ) పాటలూ, విన్నప్పుడల్లా నా కన్నీటిధారల్ని నేను ఆపుకోలేకపోతున్నాను. షురా అతని కామ్రేడ్స్ గూడ ఆ పాటలనే పాడేవారు. షురా ఎన్నడుగూడా తన పనిని గూర్చి ఒక్కమాటైన చెప్పేవాడుగాదు. రహస్యాన్ని ఎట్లా దాచాలో అతనికి బాగా తెలుసు. అతడు దండయాత్రకు పోవలసినప్పుడల్లా మామూలుగానే అమ్మా తింటానికి ఏదైనా పట్టుకు వెళ్ళాలి. అని అడిగేవాడు. అతన్ని నే నేమి అడిగేదాన్నిగాదు. ఇతరుల ప్రశ్నలకు గూడ, అతడు సైనికశిక్షణ పొందటానికి వెళ్ళాడని సమాధాన మిచ్చేదాన్ని.

మా నివాసస్థానమైన లిఖ్విన్ నగరానికి చాల దగ్గరగా జర్మనులు వచ్చారు. ఒకనాడు ఆలోచనానిమగ్నుడై ఇంటికి వచ్చాడు షురా. "అమ్మా ఎక్కువ ఆహారము పట్టుకురా, బహుశా చలికాలము వెళ్ళేదాక మళ్ళీరాను" అన్నాడు. నా గుండెలో రాయిపడింది. అతని చలికాలపుమస్తులు, నారదుస్తులు, బూట్లు తీసుకువచ్చి యిచ్చాను. అతడు తన తండ్రితో కలిసి వెళ్ళిపోయాడు. నేనూ విక్టర్ వుండిపోయాము విక్టర్‌గూడ మహా సంతోషంతో వెళ్ళేవాడే. కాని, ఈ పదమూడేండ్ల కుర్రవాణ్ణి ఎవరు చేర్చుకుంటారు !

తరువాత 5 రోజులకు మావూరు ఖాళీచేయటం ప్రారంభించారు. నేను జిల్లాకమిటీ దగ్గరకు వెళ్ళి నా కొడుకు నొకసారి పిలిపించమని కోరాను. నా కొడుకే నా ఆశ, నా ఆనందం ! మళ్ళీ వొక్కసారి వాడ్ని చూచి ఆనందం అనుభవించాలన్న బుద్ధి పుట్టింది.

షురా వచ్చాడు "నాకోసం ఎందుకమ్మా కబురుపంపించావు" అనికొంచం కోపంగా అడిగాడు"నాపనికిఆటంకంకలుగుతుందనితెలుసుకోలేకపోయావా అమ్మా !" అని మందలించాడు. "షురా, ఇక్కడనుంచి వెళ్ళిపోతున్నాము. ఒక్కసారి కలుసుకొని వెళ్ళాలనినీకుమాత్రం లేదూ ?" అని అన్నాను. షురా నావంక జాస్తూ ఎందుకులేదమ్మా ! నీవుమాత్రం విచారపడవద్దు. నీవు చాల తెలివితేటలు ధైర్యముకల దానివి. నన్నుసంతోషంగా పంపించు" అన్నాడు. "వెళ్ళునాయనా నీశక్తినంతావినియోగించి దేశాన్ని రక్షించు; నీకింకా పూర్తిశిక్షణలేదు. కాబట్టి జాగ్రత్తగా మెలగు" అని పంపించాను "ఎందుకమ్మా - పెద్దవాళ్ళకన్నా నాకేనాగాతెలుసు"అన్నాడు

నేను నాకొడుకుని కౌగిలించుకొని, ముద్దుపెట్టుకొని ఆగాను పంపించాను అంతే మళ్లీ నా చిట్టి తండ్రి నాకంటికి కనబడలేదు. నేను ఎక్కువ మూలం వెళ్లవలనుకోలేదు విక్టర్‌ను తీసికొని లిఖ్విన్‌కు సలభై ఐదు కిలోమీటర్లు మాత్రమే వెళ్లాను. నేనుగనులలో పనిచేస్తున్నట్లు వార్తవ్యాపింప జేశాను. కాని, నిజంగా నేను ఒక గెరిల్లా దళంతో సంబంధం పెట్టుకొని పనిచేయటం ప్రారంభించాను.నేనువాళ్లకి చాకలిపని జేశాను ఆహారపదార్థాలు వార్తలు అందించాను. ఒకసారి నాభర్తనన్ను చూడటానికివచ్చి "మన పిల్లవాడు చాల గొప్ప గెరిల్లా స్కౌటయాడు దళంలో వాడొక్కడే రేడియో మెకానిక్ కావడం చేత మాదళానికి రేడియోనేర్పుటు జేశాడు కమాండర్ అతన్ని చాల ప్రశంసిస్తాడు" అని చెప్పాడు. తరువాత గూఢమురాను గూర్చి కొన్ని వార్తలువిన్నాను. ఒకసారి వాడు ఒక్కడూ పదిమంది జర్మను సైనికుల నెదుర్కొన్నాడు. అరుగురిని చేతిబాంబుతో చంపి ముగ్గురిని తుపాకితోకాల్చి తప్పించుక పోయాడు. దీనినిగురించి కథలుగా చెప్పుకోడం కూడా విన్నాను. ఇవన్నీవింటున్నప్పుడు నాలో మాతృప్రేమ, గర్వం పెనవేసుకొని వుప్పొంగేవి.

తరువాత వారాలు జరిగిపోయాయి. తండ్రి దగ్గరనుంచిగాని కొడుకు దగ్గర నుండిగాని వార్తలేమిగాలేదు నాకు ఆందోళన హెచ్చింది మనసు ఎన్నోవిధాల పోయేది. నేనుఎక్కువ కాలం ఓపికపట్టలేక దళానికి ఏమిజరిగిందో తెలిసుకోదలచు కొన్నాను. విక్టర్, నేను మా అత్తగారు వుండేవూర్లో ప్రవేశించాము. ఆమెచెప్పింది. నా భర్త,కొడుకు ఇద్దరూపట్టుబడ్డారని, షురా ఒకనాటిరాత్రి మావూరువచ్చి మా పాతఇటికి వెళ్లాడని. అర్ధరాత్రివ్వుడే 12 గురు జర్మను సైనికులు ఇంటిని ముట్టడించారని, అతనివద్ద 3 చేతి బాంబులున్నా ఒక్కటీ సమయానికి పేలకపోవుటచే అతను పట్టుబడ్డాడనీ చెప్పింది. అసలు సంగతి నేను గ్రహించ గలిగాను. వాడు మోసగింపబడ్డాడు.

లోగడ నన్ను భయపెట్టిన దుర్మార్గులచేతనే షురా మోసగింపబడ్డాడు మరునాడుదయం గ్రామపెద్దమా అత్తగారింటికివచ్చి, విషపువ్వునవ్వుతూ "చలికాలంవచ్చిందినీకొడుకును రక్షించుకో" అన్నాడు. అతనిని ఎదిరించిగాని, వాదించిగాని ప్రయోజనం లేదు. చేయవల్సింది ఏమీ లేదని తెలుసుకొని అతనివెంట వెళ్లాను. అతడు నన్ను ముఖ్యకార్యాలయానికి (హెడ్‌క్వార్టర్సు) తీసుకు వెళ్లాడు. విక్టర్ నా వెనుక నెమ్మదిగా పరుగెత్తుతూ వస్తున్నాడు అచ్చట లిఖ్విన్ నుంచి వచ్చిన ద్రోహి షటనోవ్ తయారయి వున్నాడు. నన్నుచూచి లిఖ్విన్ నుంచి కనీసము ఒక్కకమ్యూనిస్టు స్త్రీఅయినా వుంది. మిగతావాళ్లు పారిపోయినట్టుంది." అన్నాడు. వెంటనే "కాదు. కమ్యూనిస్టులము పారిపోయి దాక్కొని కూర్చోము. మేము చేయాల్సిన పనిచేయటానికేమాత్రం వెనకాడము" అన్నాను. అతని మొఖము ఒక్కసారినల్లబడింది. "ఓహో, ఇదా నీతరహా; కమ్యూనిస్టులందరినీ సర్వనాశనం చెయ్యాలన్న మాహుకమ్ మీకు బాగాతెలిసే వుంటుంది" అన్నాడు. నాకుచాలా కోపం వచ్చింది ఒక్కసారి స్వేచ్ఛావాయువులను పీల్చాను. నాకళ్ల అక్కడున్న పెద్ద సిరాబుడ్డి మీద పడ్డాయి. అనేక ఆలోచనలుదయించాయి. దాన్ని తీసుకొని ఈదౌర్భాగ్యపు కుక్క మొఖాన కొట్టాలనిపించింది. నాకు అక్కడేమీ భయమనిపించలేదు. దానితో వాడిని కొట్టడం బాలులభముకూడ."వెంటనేనావిక్టర్ ఙ్ఞాపకొచ్చాడు సరే చంపండి నన్ను: ప్రతిదాన్ని కూకటివేళ్లతో 'సహాయపుమాపండి మీరు నాభరను చంపారు, నాకొడుకుని పొట్ట బెట్టుకొన్నారు నన్నునాచిన్న కొడుకును గూడ చంపండి, వాడిని గూడ తీసుకువస్తా"నన్నాను. అప్పుడు నామాటల్లో తెగింపు మూర్తీభవించి వుండాలి, వాళ్లునన్ను నమ్మారు. 'సరే నీకొడుకును తీసుకురా' అన్నాడు పెద్ద. వెంటనే ఆస్థలాన్నివదిలాను. సమయం కనిపెట్టి విక్టర్‌ను తీసుకొని బయట పడ్డాను. బజారులో ఒక జట్టును సైనికదళం నడచి పోతూవుంది. చాల త్వరగలవ తలవైపు కి మాయ మయ్యాను. ఆవిధంగా నా చిన్ని కొడుకును రక్షించు కున్నాను.

ఆపరిసర గ్రామంలో షురాను గురించిఒక కథవిన్నాను. దాన్ని ప్రజలు ఒకరికొకరుచెమ్మదిగ చెప్పుకొంటున్నారు. అప్రజలంతా 16 సంవత్సరాలుగల నాషురా మనోధైర్యాన్ని మెచ్చుకొంటున్నారు. నాజీరాక్షసులు షురాను ప్రశ్నలడగటానికి తీసుకువచ్చి, బోల్షివిక్కుని, గెరిల్లాలను దూషించారట. ఆదూషణలను భరించలేక షురా తన కోపాన్ని ఆపుకోలేక అక్కడున్న సిరాబుడ్డి తీసుకొని సైనికాధికారి ముక్కుమీద కొట్టాడు. అందుకు నా కొడుకు దారుణమైన చావుకు గురిఅయ్యాడు. నాచిట్టితండ్రిచనిపోయేటప్పుడే నేను దగ్గర లేక పోయినా,మనసులో ఎప్పుడూ వాడితోనే వుండిపోయాను.

జర్మనులను వేటాడుతూ నాషురా దెబ్బతిన్నాడు. మరెక్కడా వుండడానికి మనసు పుట్టలేదుకాబోలు- బాధతో కాళ్ళీడ్చుకుంటూ తను పుట్టి పెరిగిన పెద్దవాడైన వూరికే వెళ్లాడు. అక్కడ, మా పాత ఇంటిలో, నా తండ్రి ఆరాత్రి వంటరిగావిలాపడుతున్నాడో ! చిన్నప్పుడు- మధ్య కూర్చొబెట్టుకొని- నేనూ, వాళ్ళ నాన్న కథలు చెబుతూంటే ఎంతో ఆప్యాయంగా వినేవాడు నా తండ్రి. ఆ ఇంటిలోనే అదంతా జరిగింది. అంత చిన్నతనంలోనూ వాడికి వీరుల కథలు, కొత్తకొత్త దేశాలను కనిపెట్టిన యోధుల చరిత్రలు, శత్రువుకి లొంగిపోవడం అంటే ఏమిటో ఎరుగని అదర్శమూర్తులగాథలు అంటే ఎక్కువఇష్టం. ఆకథలు వింటూ పెరిగిన నా ముద్దుబిడ్డడు కూడా శత్రువుకి శరణనడం అంటే ఏమిటో ఎరుగకుండ నే జీవితం గడిపాడు.

ఉరికంబందగ్గరకు తీసుకుపోతూ నాజీ రాక్షసులు కత్తులతో నా బాబు పాదాలు పొడిచారట. వాడి జోళ్ళు రక్తంతోనిండి పోయాయట. నడిచిపోతుంటే వెనుక రక్తపు మడుగులు గుర్తుగా మిగిలిపోయాయి. నిజంగా ఎంత బాధపడ్డాడో ! అయినా ముఖంలో ఎక్కడా బాధఅన్నది కనబడలేదట. చనిపోతే వీరునిలాగా చనిపోడానికే నిశ్చయించాడు. నా చిట్టి "వీరుడు" అదురుబెదురు లేకుండా చురుకు చూపులతో తనను చంపడానికి వచ్చిన నీచుల ముఖంలోకి చూచేవాడట ఆకరుఘడియవరకు. ఆ నీచులు, చంపడానికి ముందు మా బాబుకొక కొయ్యపలకఇచ్చి, "గెరిల్లాలకందరికి ఈగతి తప్పదు," అని రాయమన్నారట. కాని నాషురా వీరుడు. జర్మనులిచ్చిన పెన్సిలుతోనే వారి పలకమీదే- "ఈ ఫాసిస్టు చీడపురుగులను భూమిమీదలేకుండా తుడిచిపెట్టేస్తాము," అని పెద్ద అక్షరాల్తో రాసి చుట్టూవున్న జనంలోకి విసిరాడట. ఉరిత్రాడు తన మెడకు తగిలిస్తున్నప్పుడు "నీచులారా మమ్మల్నందరినీ వురితీయడం మీతరమా ! మాసంఖ్యకు అంతులేదన్న సంగతి తెలుసుకోండి," అని నాజీల ముఖాలలోకిచూస్తూ గర్జించాడు. అలా గర్జించి నా షురా అంతర్జాతీయగీతం కంచుకంఠంతో పాడటం ప్రారంభించాడు. చుట్టూవున్న ప్రజ అప్రయత్నంగా ఆపాటను శ్రుతిగొంతుతో అందుకుంది. చిట్టితండ్రి ముద్దులమెడచుట్టూ వుచ్చుబిగుస్తూనేవుంది. తనకింక అప్పే వ్వవలేదనుకున్నాడు.

'అంతిమయుద్ధం' అనేపాటను, జర్మనుల గుండెలు అదిరిపడేలా ప్రారంభించాడు.అంతే. చిన్ననాటి తన ఆదర్శమూర్తులలో ఒకడయాడు, నా చిన్ని ముద్దులషురా!

— స్టూడెంట్ నంది

కార్మిక లోకం

వేర్వేరు ప్రాంతాలలో కార్మికులు తమ ఐక్యతా బలాన్ని ప్రదర్శించి, విజయాలు పొందుతున్నారు. 4-12-42 న విజయనగరములో పెద్దచితాని తోళ్ళషాపు కార్మికులు షుమారు 150 మంది, ఒక్కొక్కరికి రెండు రూపాయిలు యుద్ధ అలవెన్సు కావాలని సమ్మె ప్రారంభించారు. 6, 7 తేదీలలో పట్టణమంతా ఊరేగింపులు జరిపి, తమ కోర్కె నక్రమమయిందని ప్రచారంచేశారు 8 వ తారీకున పెద్దవారికి 2 రూపాయలు చొప్పున, చిన్నవారికి ఒక రూపాయి చొప్పున యుద్ధ అలవెన్సు ఇస్తామని యజమాను లంగీకరి చారు. సమ్మెదారులు కూడా యీ షరతుల కంగీకరించి పనులలో ప్రవేశించారు.

రైల్వేకార్మికునిప్రాణాలెంతచౌక!

(కామ్రేడ్ ఎ. వి. కృష్ణయ్య)

శత్రుదాడులలో రైల్వే కార్మికులు నిర్వహించవలసిన కార్యభారమెంతైనా వుంది. వారి త్యాగాలకు విలువలేదు. కాని, వారి ప్రాణాలు మాత్రం అతిచవుక అయాయి.

ఒక రోజున కామ్రేడ్ సయ్యద్ సత్తార్ అనే హమాలీకూలి బెజవాడ నుండి మద్రాసు పోయే గుడ్సుబండిలో ప్రయాణంచేస్తున్నాడు. మార్గమధ్యంలో గొంతుకలో నొప్పిబయల్దేరి, ఉలవపాడు స్టేషన్ వచ్చునప్పటికి బాధ విపరీతంగా యెక్కువయింది. వెనుక నుండి వచ్చేఎక్స్‌ప్రెస్‌ను అపుచేయించి, తన స్వస్థలమైన బిట్రగుంటలో చేరిస్తే, వైద్యసహాయం దొరుకుతుందని అతడు తోడికార్మికులకు సూచించాడు గూడ్సుబండికి కామ్రేడ్‌నమ్మయ్య గార్డు తనతోడికార్మికునిప్రమాదావస్థను అతడు స్వయంగా చూచి, ఒక్క నిమిషంసేపు ఎక్స్‌ప్రెస్‌ను ఆస్టేషన్‌లో అపుచేయించవలసిందని టెలిఫోన్‌లో తనఉన్నతాధికారినిబ్రతిమాలేడు. కాని, కార్మికుల రక్తమాంసాలతో కొవ్వెక్కిన ఆ అధికారి నిరాకరించాడు. ఎక్స్‌ప్రెస్ శరవేగంతోవచ్చి, శరవేగంతో వెళ్ళిపోయింది. కామ్రేడ్ సత్తార్ ఆశ బ్రద్దలయింది. బాధ యెక్కువై, తెట్టు స్టేషన్ సమీపంలో అతడు ప్రాణాలు విడిచాడు.

ఇది 5-10-42 న జరిగిన ఉదంతం గుండె ఆగిపోవుటచే చనిపోయాడు కాబట్టి, సత్తార్ కుటుంబానికి నష్టపరిహారమీయనవసరం లేదని రైల్వే ఏజంటు 16 వ తేదీని యూనియన్ అధ్యక్షునితో (ఎస్. గురుస్వామి) చెప్పాడు.

11-11-42 న ఈ విషయమై జిల్లా అధికారి విచారణ గావించాడు అందులో సాక్ష్యమిచ్చిన కామ్రేడ్ నమ్మయ్యను రాజమండ్రికి ట్రాన్స్‌ఫర్ చేశారు.

కాని, రైల్వే కార్మికులు నిరుత్సాహపడలేదు. ఈ వేళ కామ్రేడ్ సత్తార్‌కు సంభవించినగతి రేపు మరొకనికి పట్టవచ్చు కార్మికుల ఐక్యతద్వారా దాన్ని నివారించవచ్చు. బిట్రగుంట, బెజవాడ మొదలైన కేంద్రాలలో రైల్వే కార్మికులు తమ యూనియన్‌ద్వారా, సత్తార్ కుటుంబానికి నష్టపరిహారం కోరుతూ ఆందోళన సాగిస్తున్నారు. అన్ని బ్రాంచి యూనియన్లు ఈ కోర్కెను బలపరచవలసిందనీ, కామ్రేడ్ నమ్మయ్యయొక్క ట్రాన్స్‌ఫర్ ఆర్డరును రద్దుచేయవలసిందిగా ఆందోళన చేయవలసిందనీ, కోరుచున్నాను.

రాజమండ్రి సమ్మె పరిష్కారం

నవంబరు 25 నుండి యుద్ధ అలవెన్సుకై సమ్మె ప్రారంభించిన తోళ్ళషాపు కార్మికుల ఆందోళన ఫలితంగా నెలజీతం ఒక రూపాయి చొప్పున, అదనపు కూలి 0-0-6 చొప్పున యిచ్చుటకు యజమాను లంగీకరించారు. డిశంబరు 5 వ తేదీని కార్మికులు పనులలో ప్రవేశించారు.

రామచంద్ర పురంలో....

రామచంద్రపురం (తూ॥ గోదావరి) పంచాయితీ బోర్డు కార్మికుల ఆందోళన ఫలితంగా డిశంబరు 1 నుండి నెలకు రెండురూపాయలు చొప్పున ప్రతి వారికి యుద్ధ అలవెన్సు యిస్తున్నారు.

ఆంధ్ర రాష్ట్ర మ్యునిసిపల్ పనివారల సంఘం

పై సంఘ కార్యనిర్వాహకవర్గ సమావేశం బెజవాడలో 14-12-42 న, 15-12-42 న కామ్రేడ్ తేజప్రోలు సుబ్బారావుగారి అధ్యక్షత క్రింద జరిగింది. నేటి యుద్ధ పరిస్థితులలో దేశ రక్షణ కవసరమైన మ్యునిసిపల్ పనివారలకు కనీసం రైల్వే కార్మికులకిచ్చే యుద్ధ అలవెన్సు 8-12-0 చొప్పున అయినా యివ్వవలసిందని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించబడింది. కార్మికుల ప్రావిడెంటు ఫండుకుగాను ప్రభుత్వం 0-8-0 మాత్రం కంట్రిబ్యూట్ చేస్తుంది కనీసం 1-0-0 కి 0-1-4 అయినా వుండాలని కోరుతూ తీర్మానించబడింది అన్నిమ్యునిసిపాలిటీలలోను చౌకడిపోలు పెట్టించవలసిందనీ, శానిటరీ మేస్త్రీలకు కూడా యితర డిపార్టుమెంట్లతో సమాన హోదా యిచ్చి, యితర కార్మికులకిచ్చే సౌకర్యాలు యివ్వవలసిందని కోరుతూ తీర్మానించారు. రాష్ట్రసంఘ మెమోరాండానికి ప్రభుత్వ మిచ్చిన జవాబును ఖండిస్తూ మరొక తీర్మానం గావించబడింది. రాష్ట్ర సంఘం తరపున రూథర్‌ఫర్డ్ (ప్రభుత్వ సలహాదారు)తో మాట్లాడుట కనుమతి అయినా యీయనందుకు అసమ్మతిని ప్రకటిస్తూ సమావేశం తీర్మానించింది

ఆంధ్ర మహిళల కార్యదీక్ష

ఆంధ్ర మహిళలు తమత్యాగదీక్షతో పాటు కార్యదీక్షనుకూడా ప్రదర్శిస్తున్నారు జపాన్ ఫాసిస్టుల బారినుండి తమ మాన సంరక్షణకు వేలకొలది స్త్రీలను ర్యాలీచేయుటకు నడుముకట్టారు. గ్రామ గ్రామాన స్త్రీల సమావేశములనేర్పాటుచేసి- గృహనిర్వహణ, శిశుపోషణ, ఆరోగ్య పారిశుద్ధ్యములకు సంబంధించిన విషయాలను స్త్రీల హక్కుల నెరవేర్పుకొనుటకై కొనసాగించాల్సిన కార్యక్రమాన్ని గురించి ఉద్బోధిస్తున్నారు.

కృష్ణాజిల్లా మహిళాసంఘం తరపున గుడివాడ, దివి తాలూకాలలో ప్రచారంసాగించబడుతోంది. మహిళాసంఘాలలో విరివిగా సభ్యులు జేరుతున్నారు జనవరి నెలాఖరుకు 5 వేల మంది సభ్యులను చేర్పించుటకు దీక్ష వహించి కృషిచేస్తున్నారు. హిందూలా సవరణకు సంబంధించిన బి. యన్. రావు కమిటీ రిపోర్టులో చేయవలసిన మార్పులను గురించి తెలియజేసే మహాజర్లపై గ్రామ గ్రామాన వందలకొలది స్త్రీల సంతకాలు తీసికొంటున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలూకాలో 19 గ్రామాలలో స్త్రీల సమావేశాలు ఏర్పాటు చేయబడ్డాయి. 315 మంది స్త్రీలు హాజరయ్యారు.

రాజమండ్రిలో పట్టణ మహిళా సంఘం సమావేశమై పురుషులతోపాటు స్త్రీలకు కూడా సమాన ఆస్తి హక్కు కల్గునట్లు మార్పులు చేసి బి. యన్. రావు కమిటీరిపోర్టునువెంటనే చట్టంగా తయారు చేయాలని భారత శాసన సభవారిని కోరుతూ తీర్మానించారు. జాతీయ రక్షణకు, జాతీయైకమత్యానికి, జాతీయ ప్రభుత్వ స్థాపనకూ కాంగ్రెసు నాయకుల్ని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి తెలియజేశారు. ప్రతి ఆదివారమూ అధ్యయన తరగతులు నడుపుటకు కూడ తీర్మానించారు.

కృష్ణా జిల్లా యువజన సంఘ ఆదర్శ కృషి

ఆటపాటలద్వారా, వ్యాయామ క్రీడల ద్వారా, యువకులు తమ దేహ దారుఢ్యాన్ని, విజ్ఞాన సంపదనూ, వృద్ధిచేసుకోవడం ఫాసిస్టు ప్రతి కూల పోరాటాని కత్యవసరం. కృష్ణా జిల్లా యువజన సంఘం ఈ విషయంలో బహుశ్రద్ధగా పాటుపడుతోంది. దీనికి అనుబంధశాఖలైన గుడివాడ, గన్నవరం, దివి, బందరు, బెజవాడ, తాలూకా సంఘాలు సంవత్సరంలో, ఆయా తాలూకాల యువకుల్ని పందెముల ద్వారా సమీకరించి, 'యువకుల ఆపన్యాసాను ప్రచారంగావించాయి.

అన్ని తాలూకాలలో మొత్తం 53గ్రామాల నుంచి వచ్చిన యువకులు ఈ క్రీడా పోటీలలో పాల్గొన్నారు చెడుగుడు టీములు 73; లాంగ్ జంప్‌లో 73 రు (16 అ. 9 అం.) హైజంప్‌లో 60 మంది (5 అ. 6 అం): పోల్ జంప్‌లో 31 మంది (7 అ 6 అం): హర్డిల్సు 39 మంది: బంతి విసరడ లో 52 మంది (79గ); గుండు విసరటలో 31 మంది (26 అ. 2 అం): మైలు పరుగులో 30 మంది (6 ని మి): 100 గజాల పరుగులో 40 మంది ఫర్లాంగు పరుగులో 12 మంది ($\frac{1}{2}$ ని మి): 2 ఫర్లాంగుల యీతలో 26 గురు (6 ని మి) సైకిలు స్లో 8 మంది: సైకిల్ స్పీడు 19మంది; టగ్ ఆఫ్‌వార్‌లో 30 మంది; అడ్డదిడ్డాల పరుగులో 10 మంది ఈ పోటీలకు హాజరైన ప్రేక్షకులు సుమారు 22.500 మంది. బహుమతులు వెజ్ఞానికంగాను, శారీరకంగాను, యువజనాభివృద్ధికి కావలసినవి యివ్వబడ్డాయి జపాన్ దండ యాత్రకు సులభ సాధ్యమైన ఆంధ్రరాష్ట్రంలో యువకులు జపాన్ ప్రమాదాన్ని గుర్తించేటట్లు బహుమతులిచ్చే సమయంలో యువకుల్ని, ప్రేక్షకుల్ని ప్రబోధించుతూ వచ్చారు. యువకులందరిలో ఐక్యత యొక్క అవసరాన్ని నొక్కిచెప్పారు. దివి తాలూకాలో శ్రీ దండమూడి రాజగోపాలరావుగారు; గన్నవరం తాలూకాలో శ్రీ కొల్లి రంగదాసుగారు, కొన్ని వేల మంది ప్రేక్షకుల యెదుట బలప్రదర్శనాలు చేశారు దివి తాలూకాలో 'దేశభక్తులు' మొదలైన ఫాసిస్టు వ్యతిరేక నాటకాలు ఆడి. ప్రజలలో ఫాసిస్టు వ్యతిరేక భావాలు కలిగించారు.

ఈ ఆటలద్వారా అన్నివర్గాల యువకుల్ని యువజన సంఘ పతాకం క్రింద సమీకరించ గలిగారు

భారతదేశ విముక్తి అవసరం

(3 వ పేజీ తరువాయి)

బొంబాయి ఎ. ఐ. సి. సి. లో జరిగిన చర్చలకు నెహ్రూ జవాబిస్తూ, తీర్మానం బెదరించడానికి ఉద్దేశించబడలేదనీ, యుద్ధంలో సహకారం చేయడానికే ఉద్దేశింపబడిందనీ ఉపన్యసించాడు. కాంగ్రెసు యెట్టి కార్యక్రమాన్ని యిచ్చినా, అది చైనాకు హాని కలిగించేదిగా ఉండదనీ, ఇండియా - చైనాలలో జపానుచేసే దురాక్రమణకు సహాయపడేదిగా ఉండదనీ, గాంధీజీ, జంగ్ - కై - షేకుకు జవాబు వ్రాశాడు. కార్యాచరణకు ముందు వైస్రాయికి జాబు వ్రాస్తానని గాంధీజీ ప్రకటించాడు. కాని జాబు పూర్తికాకుండానే నాయకులరెస్టుచేయబడ్డారు. వెంటనే దేశంలో తిరుగుబాట్లు, అరాజకం చెలరేగాయి. ఈ విధంగా సామ్రాజ్యవాదులు భారతీయుల్ని రెచ్చగొట్టారు. రాజీ కొరకు కాంగ్రెసు చేయబోయే ప్రయత్నాలను ప్రభుత్వం నిరాకరించి, క్రూరమైన నిర్బంధ విధానాన్ని ఆచరణలో పెట్టడం ప్రశంసించదగిన పంథాకాదు కాంగ్రెసు సంస్థను, జాతీయోద్యమాన్ని ధ్వంసం చేయడానికి తరుణంకొరకు వెదకడమే అధికారవర్గం ప్రధానంగా పెట్టుకున్నారు. గాని, జపానుకు వ్యతిరేకంగా భారతీయుల్ని సమీకరించడ మెలాగ ? అనే ప్రశ్నను ప్రధానంగా పెట్టుకోలేదు. ప్రభుత్వాధికారంలో వున్న అభివృద్ధి నిరోధకుల సంకుచిత దృష్టిని యిది సూచిస్తోంది.

బ్రిటిష్ ప్రజల సానుభూతి

భారతదేశంలో నేడున్న విషమ పరిస్థితిని తొలగించడానికి బ్రిటిష్ ప్రజలంతా పూనుకోవలసియుంది. ఉభయదేశాల శ్రేయస్సుకు ఇది అత్యవసరం. తక్షణమే భారత జాతీయ నాయకులతో రాజీచేసుకోవాలని బ్రిటిష్ ప్రజలంతా తీవ్రమైన ఒత్తిడి తీసు రావాలి. ఈ ఆందోళన బ్రిటన్‌లో యిదివరకే ప్రారంభమయింది. బ్రిటిష్ గనులలోపనిచేసే 5 లక్షల మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహించే మైనర్స్ ఫెడరేషన్- భారత దేశ స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వం గుర్తించి, వెంటనే అచటి నాయకులతో సంప్రతింపులు జరపవలసిందని హెచ్చరిస్తూ తీర్మానించింది. అనేక ఫ్యాక్టరీలలో యీ సమస్యపై కార్మికులిచ్చిన వోట్లు చూస్తే 100కి 90 మంది భారతదేశపు జాతీయ వాంఛను బలపరిచారు బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ ప్రారంభించిన ఉద్యమానికి అనేక బహిరంగసభలలో ప్రజలసహకారంవస్తూంది. ఇదే విధంగా ప్రపంచ ప్రజలు భారత దేశ సమస్య యెడల సానుభూతిని ప్రదర్శిస్తున్నారు. కాని, బ్రిటిష్, కార్మికులు ప్రజాతంత్ర శక్తులు ప్రధానంగా యిందుకు పూనుకోవలసియుంది. ఫాసిజాన్ని ఓడించడానికి, అన్ని దేశాల ప్రజలకు (భారతీయులకు సహితం) స్వాతంత్ర్యం లభించడానికి, భారతీయుల హృదయపూర్వక సహకారం మవసరం. అందుకై బ్రిటిష్ ప్రజలు తమ ప్రభుత్వంపై బలమైన ఒత్తిడి తీసుకొచ్చి, భారతీయులకు- బ్రిటన్ దేశస్థులకుగల సమానాశయం నెరవేరేటట్లు కృషిచేయాలి. ప్రస్తుత ప్రభుత్వ విధానాన్ని అపుచేసి, ఒడంబడికకై సంప్రతింపులు జరగాలి.

పోలీసుల దురుసుతనం

9 12 42 న సామర్లకోటలో కామ్రేడ్ భావనాచారిని బలవంతంగా పోలీసు స్టేషనుకు తీసుకుపోయి, సబ్ ఇన్స్పెక్టరు, సర్కిల్ దబాయిస్తూ "యిక్కడ వుండొద్దు. మీ వూరు వెళ్ళిపో. ఇక్కడవుంటే అరెస్టు చేస్తాం. జాగ్రత" అని బెదిరించారు ఆ సాయంత్రమే తిరిగి సూపరింటెండెంటువచ్చాడని కబురంపి, భావనాచారిని స్టేషనుకు తీసుకపోయారు. సూపరింటెండెంటు, "సి. వి. కె. రావు గతి యేమైందో చూచావా ? నీ రోజులు దగ్గరపడుతున్నాయి" అంటూ అతన్ని బండబూతులు తిట్టాడు.

గన్నవరంతాలూకా వ్యవసాయ కూలీసంఘం

గన్నవరం తాలూకాలో వ్యవసాయ కూలీ సంఘాలను స్థాపించుట కోసం 27 గ్రామాల్లో ప్రచారం చేయబడింది. ఇప్పటికి 7 గ్రామాల్లో 573 గురు సభ్యులుగా చేరారు. మిగతా గ్రామాల్లో సభ్యులు చేర్పించ బడుతున్నారు. అరాచక చర్యల మూలంగా కొన్నిచోట్ల సంఘాల్లో చేరటానికి జంకుతున్నారు. కాని వ్యవసాయ కూలీల క్షేమం కోసం జంకూ గొంకూ లేకుండా సంఘాలను స్థాపించు కోవాలని ఉత్సాహం పురికొల్ప బడుతోంది.

బొద్దువాని గూడెం, మైది, కొండలపాలెం, నాగన్న గూడెములనుండి స్థానికయిబ్బందులు నివారించు కోటం కోసం అర్జీలు పెట్టబడ్డాయి.

మధ్య డాన్ ప్రదేశంనుండి మరో కొత్తదాడి

సోవియటు యుద్ధరంగంలో ఈ వారం మరొక ఉత్సాహకరమైన వార్త. మధ్యడాన్ ప్రదేశం నుండి సోవియటు ఎదురుదాడి ప్రారంభించింది.

సోవియటు శీతాకాలపు దాడులు ప్రారంభమై నెలరోజు లయింది. స్టాలిన్‌గ్రాడ్, రెజెవ్ రంగాలలో, అపుడు కొట్టిన ఆకస్మిక వజ్రాఘాతాలకు, జర్మన్లు నివ్వెరపోయారు. స్టాలిన్‌గ్రాడ్ రంగంలో జర్మన్లు అడకత్తెరలో చిక్కున్నారు. రెజెవ్‌లో, రెజెవ్‌కు పశ్చిమంగా యుద్ధం జరుగుతోంది. వెలికిలుకీలో సోవియటు ప్రవేశించినట్లు జర్మనువార్త. ఇది ఇట్లుండగా ఇపుడే మూడవదాడి.

వారోనెజ్-రోస్టావ్ రైలుమార్గానికి ఎదురుగా, ఉత్తరడాన్ నదీతీరాన ఉన్న "బోగువార్"ను చట్టుముట్టి సోవియటు సైన్యాలు ఆదివారంనాడు వశపరచుకున్నాయి. ఇది వారోనెజ్‌కు ఆగ్నేయంగా 140 మైళ్ళలోను, స్టాలిన్‌గ్రాడ్‌కు వాయువ్యంగా 180 మైళ్ళలోను వుంది.

వారోనెజ్ – రోస్టావ్ రైలుమార్గంలోని కాంటిమిరోవ్కాను సోవియటు పట్టుకుంది. దీనితో ఈ రైలుమార్గం ఛేదించబడింది. వారోనెజ్‌వద్దనున్న జర్మనుసైన్యాలకు రోస్టావ్‌తోటి సంబంధం తెగిపోయింది. ఇది వారోనెజ్‌వద్ద నున్న సోవియట్ సైన్యం సాధించింది. మరొక సైన్యం ఇదే మార్గంలో, కాంటిమిరోవ్కాకు 60 మైళ్ళ దక్షిణాన వున్న మిల్లిరోవోను పట్టుకొన ప్రయత్నించుతోంది. అపుడే దానికి 18 మైళ్ళదూరంలోకి వచ్చినట్లు గూడ వార్త.

మిల్లిరోవో రోస్టావుకు 130 మైళ్ళదూరంలో వుంది. దానిని గత జులై 15 వ తేదీని జర్మన్లు వశంచేసుకున్నారు. అందుచే దక్షిణ భాగంలోకి ఉరకడానికి జర్మన్లకు మంచి అవకాశ మిచ్చింది.

డిశంబరు 16 వ తేదీన ప్రారంభమైన ఈ దాడికి 5 దినాలలోనే 100 గ్రామాలు వశమయాయి. 8 వేలమంది శత్రువులు నిహతులయ్యారు. 13 వేల 500 మంది ఖైదీలయ్యారు. సోవియటుసైన్యం ఈనాటి కప్పుడే 95 మైళ్ళు ముందుకు చొచ్చింది.

డాన్, వాల్గా నదులమధ్య చిక్కిన జర్మను సైన్యాలు ఇంకా సమూలంగా నాశనం కాలేదే. ఇంకా ఎదురుదాడులు సాగించుతూనేవున్నారే, రెజెవ్‌వద్దను, కోటిల్నికోవ్‌వద్దను తీవ్రంగా జర్మన్లు నిలబడి యుద్ధం సాగించుతున్నారే. ఇలాంటిసమయంలో, ఈ నూతన దాడికి కారణం ఏమిటి? అని అడుగవచ్చు.

సోవియటు లక్ష్యం

సోవియటు వలయంలో చిక్కిన జర్మన్లను రక్షించడానికి చేసిన విశ్వప్రయత్నాలన్నీ వ్యర్థమయినాయి. అందుచే, జర్మనీ కోటిల్నికోవ్ వద్ద తీవ్ర ప్రతిఘటన సాగించి ఎదురుదాడులు సాగించింది. జర్మనుఉద్దేశ్యం కోటెల్నికోవ్‌ను దాటి ఆగ్నేయంగా ఇంకా ఏ 50 మైళ్ళవరకో పోయి, అక్కడనుంచి హఠాత్తుగా వెనుదిరగాలని. అలా తిరిగినట్లయితే, జర్మనుసైన్యాలను వలయంలోపిగించియున్న డాన్ పడమటిఒడ్డున వున్న రష్యన్ సైన్యాలను అడకత్తెరలో పెట్టవచ్చునని, ఆవిధంగా తమ జర్మనుసైన్యాలకు దారిచూపించవచ్చునని ఆశించింది, జర్మను మిలటరీ నాయకత్వం. కాని కోటెల్నికోవ్ వద్ద జర్మను సైన్యాలకు విజయం లభించలేదు కదా మరో ఉపద్రవం వచ్చిపడింది

ఈ నూతన దాడి ఫలితంగా (1) వారోనెజ్-రోస్టావ్ రైల్వేలో గండిపడింది. అలాగే ఖార్కావ్-కామెన్‌స్కాయ (ఇది డానెట్సు నదీ, రోస్టావ్-వారొనెజ్ రైల్వే మార్గమూ కలిసే కూడలిలో వుంది) – స్టాలిన్‌గ్రాడ్ రైల్వేకు కూడ ప్రమాదం హెచ్చింది. (2) స్టాలిన్‌గ్రాడ్ వలయంలో చిక్కిన సైన్యాలకు రాకపోకలు లేకుండా పూర్తిగా నశించడానికి అవకాశం యేర్పడుతుంది

సోవియటు సైన్యాలు క్రమంగా రోస్టావ్ పైకి మరలుతాయని చెప్పనక్కర లేదు. రోస్టావ్ సోవియటు చేతులలో చిక్కిననాడు, కాకాసియాలోని జర్మను సైన్యమంతా చిక్కుపడుతుంది.

స్టాలిన్ జన్మ దినోత్సవ (డిశంబరు 21) కానుకగా సోవియటు సైన్యాలు పొందిన యీ విజయాలు ముమ్ముందు యావత్ జర్మను పరిస్థితులనే తల్లక్రిందులు చేసే టట్లున్నాయి. జర్మనీ పొందిన పరాజయాలలో యిది చాల ప్రాముఖ్యత వహించగలదు.

సోవియటు జర్మను యుద్ధపరిస్థితిని, సుప్రసిద్ధ సోవియటు రచయిత అలెక్సీ టాల్‌స్టాయ్ "సోవియటు వార్ న్యూస్" పత్రికలో క్రింది విధంగా క్లుప్తీకరించాడు:

"జర్మనీ మాపై (రష్యాపై) దాడి సాగించిన నాటినుండి సోవియటు యుద్ధ రంగంలో 80 లక్షల మందిని కోల్పోయింది (చనిపోయినవారు, గాయపడినవారు). వేలకొద్దీ టాంకులకు, ఫిరంగులకు నష్టపడింది....

"స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం భయంకరంగా 3 నెలలు సాగింది. ఈ యుద్ధంలో హిట్లరు పైశాచిక సైనిక బలాన్ని, మందు సామగ్రిని విచ్చగా తెగ కుప్పించాడు. అట్టి స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం రష్యన్లు హఠాత్తుగా శత్రువుల రైల్వే రాకపోకలను ఛేదించుటతోను, హిట్లరుసైన్యాలలో 3 వ వంతును నాశన మొనర్చుటతోను అంతమయింది.

"నవంబరు మాసాంతంలో మనం రెజెవ్, వెలికిలుకీలవద్ద దాడి సాగించాం ఇది హిట్లరుకు ఆశ్చర్యం కల్గించకపోవచ్చు. కాని అభేద్యమని తలపబడే "హిట్లర్ శ్రేణి"లో మూడు పెద్ద గండ్లు కొట్టాం, బహుశా యిది హిట్లరును ఆశ్చర్యపరిచింది.

"ఈ సంవత్సరాంతం హిట్లరుకు విషాదాంతంగా ముగుస్తోంది. 1941 డిశంబరు 6 న మాస్కోవద్ద అతని విజయ రేఖ క్రిందికి వంగింది. వేసవిలో మరల రెండు గంటలు పైచింది కాని మరల పడిపోవడానికే అలా ఊర్ధ్వముఖం పట్టింది.

"రెండవ దశలో (1941 డిశంబరు నుండి 1942 నవంబరు వరకు) మనం కూడా చాల నష్టపడ్డాం. డాన్‌క్యూబాన్ ప్రదేశం, ఉత్తర కాకాసస్, హిట్లరు దాస్యంలోవున్నాయి. మన భార్యలు, పుత్రికలు, పశువులు దుఃఖం మధ్య జర్మనీకి బలవంతంగా తీసుకుపోబడుతున్నారు. మన తల్లి తండ్రులు శిథిల గృహాలలో చలికి గడ్డకట్టిపోతున్నారు. కాని రెడ్ఆర్మీ దళాలు అప్పుడే ముందుకు పోతూ వున్నాయి."

ఈవిధంగా అన్నిరంగాలలోను, చొరవ సోవియట్ల చేతిలోకి వస్తోంది. ఇంతేగాదు.

ఆఫ్రికా

ఆఫ్రికాలో సైతం రోమెల్ ఇంకా వెన్ను చూపుతూనేవున్నాడు ఆఫ్రికా ఉత్తరతీరం వెంట బ్రిటిష్ సైన్యాలు ముందుకు చొచ్చుకుపోతున్నాయి. నొఫిలియా ఖాళీచేయబడింది. సుల్తాన్‌చుట్టూ యుద్ధం జరుగుతోంది బిజర్టా, ట్యూనిస్ ట్రిపోలీ ప్రదేశంలో నిలబడియుద్ధం చేయడానికి శత్రువు సమీకరించుతున్నాడు. అయినా, ఉత్తర ఆఫ్రికానుండి సిసిలీనుండి, శత్రువు తరిమివేయబడేస్థితిలో వున్నాడు. ఇటలీపైన దండయాత్ర ప్రమాదం కూడ హెచ్చింది ఈవిధంగా యుద్ధచరిత్రలో మొట్టమొదటి సారిగా, చొరవ హిట్లరు చేతిలోనుండి జారిపోయింది. కాని, హిట్లరు తన యావచ్ఛక్తినీ సమీకరించి తిరుగుదెబ్బ కొట్టాలని ప్రయత్నించుతున్నాడు. అప్పుడే అతడు నిర్వీర్యుడయాడని తలచరాదు. అతడి కా ప్రమాదకరమైన శత్రువన్న స గతి మరచిపోగూడదు అందు చేతనే, ఆఫ్రికా యుద్ధం త్వరలో ముగించి, యూరప్‌లో రెండవ రంగం తెరవవలసిన ఆవశ్యకత మరింత ఎక్కువవుతుంది. అట్టి చర్యకు డార్లాన్‌తోటి సంధి ప్రతిబంధకంగా వుంది.

ప్రపంచ యుద్ధసమీక్ష

డార్లాన్ సమస్య- వలసరాజ్య ప్రజలసమస్య

డార్లాన్ విషయమై ఆందోళన "ఫ్రీఫ్రెంచి ముఠా"యేగాక, అమెరికా బ్రిటిషు ప్రజలు గూడా తీవ్రంగా చేస్తున్నారు. న్యూస్‌క్రానికల్ 10 వ తేదీన ఇలావ్రాసింది. "హోర్-లావల్ పాక్టుకు వ్యతిరేకంగా చెలరేగిన ప్రజా దోళనతో, ఇప్పటి ఆ దోళనను పోల్చవచ్చు" "న్యూస్టేట్సుమన్ అండ్ నేషన్" పత్రిక ఇలా వ్రాసింది. "1918 లో సోవియటు స్వాతంత్ర్య యుద్ధాన్ని రక్తప్రవంతులలో ముంచుతున్న విద్రోహి కోల్చాక్‌తో సంధిచేసికున్ననాడు ఇలాగే, ఏహో తమను సమర్థింపజూచుకొంది"

స్పెయిన్‌లో పోరాడిన ఇంటర్నేషనల్ బ్రిగేడ్ యోధుల విడుదల గురించి, యూదులపై నిర్బంధ చర్యలను గురించి, ఆందోళన హెచ్చింది. తత్ఫలితంగా, డార్లాన్ ఈ క్రింది విధంగా ఉపన్యసింపవలసి వచ్చింది. డార్లాన్ ఉపన్యాసంలోని ముఖ్యవిషయాలివి (1) అక్ష రాజ్యాలనుండి విముక్తినొందిన పిమ్మట ఫ్రెంచి ప్రజలే తమ నాయకులను ఎన్నుకోవచ్చు. (2) మిత్రమండలితో సానుభూతిగల వారినందరినీ విడిచిపెట్టాలని ఇదివరకే ఉత్తర్వు ఈయబడింది. (3) జర్మనీ ఒత్తిడివల్ల యూదులపై చేసిన నిర్బంధాలు ఆగిపోతాయి.

కామన్సుసభలో అడిగిన ప్రశ్నల ననుసరించి, ఇంటర్నేషనల్ బ్రిగేడ్ యోధుల విడుదల విషయం ఏమీ ఆలోచించలేదు. ఫ్రాంకోను సంతృప్తిపరచడానికి, బ్రిటీషు ప్రభుత్వం వారి విడుదల గురించి ఒత్తిడి చేయడంలేదు.

డార్లాన్ కల్లిబొల్లిమాటలు నమ్మడంఎలా? ఫ్రీ ఫ్రెంచినాయకు లొకరుచెప్పినట్లు, డార్లాన్ యుద్ధం ముగిసేదాకా తన అధికారాన్ని నిలబెట్టుకొని, ఆఫ్రికాలో తాను తయారుచేయుచున్న సైన్యంతో తన డిక్టేటరు షిప్‌ను రుద్ద చూస్తున్నాడు.

"పీపుల్సువార్"కు ప్రత్యేక తంతిద్వారా ఇవార్ మోంటాగూ పంపిన సమాచారంలో ఇలావుంది. "డార్లాన్,అభివృద్ధినిరోధక వలంటీరుదళం నుండి, హిట్లరు కీలుబొమ్మ 'దోరియటు' తయారుచేసిన ఫాసిస్టు ముఠానుండి, మనుష్యులను ఏరి పోలీసు ఉద్యోగాలను ఇస్తున్నాడు. ఆ విధంగా మొరాకోగుండా పోవలసిన మిత్రమండలి రాకపోకలకు, డార్లాన్ ప్రభుత్వం మిలటరీగాకూడప్రమాదకరమైనదే. స్పానిష్ సైనికాధిపతులతో ఇదివరకే సంబంధముంచుకొనియున్న డార్లాన్, మంచి దృఢమైన స్థానంలో ఉంటున్నాడు. అక్కడనుండి, మిత్రమండలికి అతడు ద్రోహం తలపెట్టవచ్చు."

ఇట్టి ప్రమాదమున్నా, కార్డెల్‌హల్, జనరల్ సికోర్‌స్కీలాంటి సామ్రాజ్యవాదులు, తమ వెనుకటిపంథానే అవలంబించుతున్నారు. ఆపీజ్‌మెంటు పాలసీనే అవలంబించుకున్నారు. ఫ్రీఫ్రెంచ్‌వారికీ, డార్లాన్‌కూ, తగాదా అన్నట్లుగా "ఫ్రెంచివారందరూ ఏకంగావాలి" అని నీతి బోధలు చేస్తున్నారు.

డార్లాన్ సమస్య వ్యక్తిగత సమస్యకాదు. డార్లాన్‌తోటి సంధి అంటే వలస ప్రజలకు విముక్తి లేదన్నమాట ఆఫ్రికా వలస ప్రజల విముక్తి లేనిదే, ఫ్రెంచి విముక్తికి ప్రతిబంధకం తొలగజాలదు, డార్లాన్ ఉదంతం వలస ప్రజల సమస్యను బ్రిటిషు అమెరికను ప్రజలముందు పెట్టింది సామ్రాజ్యవాద పునరుద్ధరణకు యిచ్చగింపక తమ అసమ్మతిని తెలియజేసే యీ ప్రజలు, వలస రాజ్యాల విముక్తికై పోరాడ బలం సంపాదించుకోవాలి.

ప్రాచ్య ఖండంలో

బర్మాలో బ్రిటిషు సైన్యాలు అరకాన్‌కు దక్షిణంగా కదిలాయి మౌంగడా ప్రదేశాన్ని ఆక్రమించుకొన్నాయి. ఇది అప్పుడే బర్మా పునరాక్రమణ ప్రయత్నం అని తలచరాదు. అట్టి ఆక్రమణ, జపాను నౌకాబలం యింకా క్షీణించకముందే సాధ్యంకాదు.

న్యూగినీలో బూనా మిత్రమండలికి వశమయింది. కాని, తిరిగి గోనాకు ఉత్తరంగా జపాను సైన్యాలను దింపగల్గింది. అంటే విపరీత నష్టాలు కల్గినా, జపాను నౌకా బలం క్షీణించలేదని యీ విషయం వల్లనే స్పష్టమౌతోంది. జపాను నౌకా బలం క్షీణించనంత కాలం బర్మా పునరాక్రమణ అసాధ్యం. అందుచే బర్మా విజయంగాని, బర్మాపై దాడిగాని, మన కళ్ళకో దుమ్ముగొట్టరాదు. జపాను దండయాత్రా ప్రమాదం – మరెందుకు గాకపోయినా – మనం దానిని ప్రజలం గనక, మన మాతృభూమి సామ్రాజ్యకాంక్షగల ప్రతివారికీ నోరూరించే రత్నగర్భగనుక – హెచ్చుగా వుంది.

మన పొరుగు ఆంధ్రావనిపై జపాను హంతకులు బాంబులువేసిన సంగతి ఇంకా మరచిపోలేదు. చిటగాంగుపై ఇప్పటి కప్పుడే 7 సార్లు జపాను ఫాసిస్టు కిరాతకులు దాడి చేశారు మరల ఇప్పుడు "పూర్ణభూమి" బెంగాల్ ముఖ్యనగరం కలకత్తాపై రెండుదాడులు జరిగాయి జపాను హంతకుల ఈ ఘాతుక చర్యలకు జవాబు, ప్రజలు జాతీయైక్యతను సంపాదించి, జాతీయ ప్రతిఘటనద్వారా ఈయాలి.

—కామ్రేడ్ తుమ్మల వెంకటరామయ్య

Published by Kairagadda Rajagopala Rao, and Printed by The Popular Printers, Governorpet, Bezwada.

END OF ISSUE